





# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 07 సంచిక : 357 అమలాపురం ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ బుధవారం 28 ఆగస్టు 2024 పేజీలు : 12 వెల : 2/-


## మోడీ రిటర్న్ జర్నీ



### ఉక్రెయిన్ మీద 100 డ్రోన్లతో దాడి

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉక్రెయిన్ పర్యటన ముగిసిందో లేదో.. ఆ దేశానికి చుక్కలు చూపిస్తోంది రష్యా. ఇరుదేశాల మధ్య శాంతి కోసం తన వంతు సాయం చేస్తానని చెప్పిన మోడీ.. ఇరుపక్షాలకు ఒకే అయితే తాను **మిగతా 2లో..**

## 7 కొత్త ఎయిర్‌పోర్ట్‌లు



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఏపీకి కేంద్రంలో మంచి శాఖ లభించింది అని అంతా సంతోషించారు. దానికి యువకుడు అయిన రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చూస్తున్నారు. దివంగత ఎర్రన్నాయుడు కుమారుడు అయిన రామ్మోహన్ తన పనితీరులో జోరు చూపిస్తున్నారు. గత రెండున్నర నెలలుగా ఆయన పౌర విమాన యాన శాఖ విషయంలో ఏపీకి శుభవార్తలే చెబుతున్నారు. ఒక విధంగా ఏపీని ఆయన విమానమే **మిగతా 2లో..**

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు
## బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :**
హమ్మయ్య.. ఎట్టకేలకు బీఆర్ఎస్ కు ఊరట కలిగించే అంశం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి.. మేడిగడ్డతో కుంగిపోయి.. లోక్ సభ ఎన్నికల్లో జీరోకు పరిమితమై.. ఎమ్మెల్యేలను కోల్పోయి.. అధినేత **మిగతా 2లో..**



## ఏపీలో రైతులకు
# గుడ్‌న్యూస్ !

### ప్రభుత్వ భూములే కాదు..
## అడవులు కూడా వదల్లేదు



చంద్రబాబు, పవన్ ఆరా 2

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్**
ఏపీలో కొలువుదీరిన జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు వారికి అవసరమైన అన్నిరకాల సహాయక చర్యలను ఎప్పటికప్పుడు **మిగతా 2లో..**

**ఏపీలోని రైతులకు రూ.1.60 లక్షలు**

### ఈ పదవిపైనే
## గల్లా చూపు !



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
2019లో వైసీపీ సునామీని తట్టుకుని మరీ విజయం సాధించిన కొద్దిమందిలో ఆయన ఒకరు. ప్రముఖ సినీ నటుడు మహేశ్ బాబు బావ, ప్రముఖ పారిశ్రామికవేత్త, గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఇటీవల ఎన్నికల్లో పోటీ చేయని సంగతి తెలిసిందే. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఆయన గెలుపొందారు. 2019లో వైసీపీ సునామీని తట్టుకుని మరీ విజయం సాధించిన కొద్దిమందిలో ఆయన ఒకరు. కాగా వైసీపీ ప్రభుత్వంలో గల్లా జయదేవ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయనకు చెందిన అమర్ రాజా బ్యాటరీస్ కాలుష్య ప్రమాణాలు పాటించడం లేదంటూ అధికారులు దానికి సీల్ వేశారు. దీంతో గల్లా హైకోర్టును ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వులు పొందారు. అయినప్పటికీ టీడీపీ ఎంపీ అనే ఒక్క కారణంతో వైసీపీ ప్రభుత్వం గల్లా **మిగతా 2లో..**

### నేడు టీడీపీ ఖాతాలోకి మరో
## మున్సిపల్ కార్పోరేషన్!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఏపీలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక విపక్షంలో ఉన్న వైసీపీ చేతుల్లో ఉన్న స్థానిక సంస్థలు ఒక్కొక్కటిగా చేజారుతున్నాయి. వీటిని తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు అధికార కూటమి **మిగతా 2లో..**

### అంబటికి షాకిచ్చిన
## నాయకులు..!



**సత్తెనపల్లి, విశ్వంవాయిస్ న్యూస్ :**
పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వైసీపీ సీనియర్ నాయకుడు అంబటి రాంబాబుకు భారీ షాక్ తగిలింది. నియోజకవర్గంలోని **మిగతా 2లో..**

## ఏలూరులో వైసీపీకి భారీ షాక్ !



**ఏలూరు, విశ్వంవాయిస్ న్యూస్ :**
ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేందుకు పలువురు వైసీపీ నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఏలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ(చంటి) నేతృత్వంలో ఏలూరు కార్పోరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు టీడీపీలో చేరారు. వీరితో పాటు ఈయూడీఏ మాజీ ఛైర్మన్, ప్రస్తుత వైకాపా పట్టణ అధ్యక్షులు బి.శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మంచం మైబాబుతో పాటు పలువురు వైసీపీ నేతలు విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో **మిగతా 2లో..**



## యోగాకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందచేయాలి

4

### మారిన ఏలూరు
## రాజకీయం !




**ఏలూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని(కాళీకృష్ణ శ్రీనివాస్) ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తర్వాత.. రాజకీయాల నుంచి కూడా తప్పుకొంటున్నట్టు ప్రకటించారు. ఇది జరిగి వారం రోజులుకూడా గడవకముందే.. నియోజకవర్గంలో సంచలనాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా వైసీపీకి బిగ్ షాక్ తగలనుంది. ఏపీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం ప్రభావంతో **మిగతా 2లో..**

### పబ్లిక్‌లో రేవంత్ క్రేజ్
## పెరుగుతోందా ?



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :**
తేనె తుట్టను కదిలించటం ఆషామాషీ వ్యవహారం కాదు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా చేతిలో ఉన్న కర్రతోనో.. రాయితోనో దాన్ని టార్గెట్ చేస్తే.. తొలుత ఇబ్బందికి గురయ్యేది.. తేనెతుట్టను టార్గెట్ **మిగతా 2లో..**

### ఎమ్మెల్సీ అనంత బాబుపై
## వివాస్పద వ్యాఖ్యలు సరికాదు

**ప్రశాంతమైన వాతావరణాన్ని కలుషోత్తం చేస్తున్న టిడిపి కార్యకర్త ఉమా**
**చెలికాని ఉమా పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.. స్థాయిని మరిచి వ్యాఖ్యలు సరికాదు**

**కూనవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
కూనవరం ఎమ్మెల్సీ అనంత బాబు పై వివాస్పద వ్యాఖ్యలు చేసిన కూనవరం టిడిపి కార్యకర్త చెలికాని ఉమా పై పోలీస్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి కూనవరం విఆర్ పురం మండలాల. ప్రజా ప్రతినిధులు పార్టీ **మిగతా 2లో..**



(మొదటిపేజీ తరువాయి)

## బెయిల్ మంజూరు

కూతురు జైలుపాలైన పరిస్థితుల్లో.. కారు పార్టీని కాలం కనికరించింది. బీఆర్ఎస్ శ్రేణులకు కాస్త మనో ధైర్యం కలిగే పరిణామం చోటుచేసుకుంది. ఐదు నెలలుగా తిహాడ్ జైల్లో గడిపిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మార్చి 16న ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆమెను తిహాడ్ జైలుకు తరలించారు. అప్పటినుంచి కేసు అనేక మలుపులు తిరిగింది. సీబీఐ కూడా మధ్యలో ఎంటరైంది. కాగా, జైలులో కవిత తొలి రోజుల్లో ధైర్యంగానే ఉన్నప్పటికీ బెయిల్ ఆలస్యం అయ్యేకొద్దీ మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడినట్లు తెలిసింది. మొత్తమ్మీద ఆమె 11 కిలోల బరువు తగ్గినట్లుగా సోదరుడు కేటీఆర్ తెలిపారు. మరోవైపు ఆధ్యాత్మిక చింతనకు కవిత జపమాల తెప్పించుకున్నారు. కొన్ని పుస్తకాలను కూడా కోరారు. ఇక కవితకు గతం నుంచి ఉన్న ఆరోగ్య సమస్యలు జైలులో ఆమెను ఇబ్బంది పెట్టాయి. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు.. జైలుకు వెళ్లి ధైర్యం చెప్పారు.

**వస్తుందనుకున్న బెయిల్ :** కవితకు బెయిల్ వస్తుందని పలుసార్లు కోర్టు విచారణల సందర్భంగా భావించినా అది సాకారం కాలేదు. చివరి నిమిషంలో నిరాశే ఎదురైంది. అయితే మంగళవారం ఢిల్లీ మద్యం కేసులో ఈడీ నమోదు చేసిన కేసులో సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, ఈడీ తరఫున ఏఎస్‌జీ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ద్విసభ్య ధర్మాసనం కవితకు బెయిల్ ఇచ్చింది.

**సీబీఐ కేసులో ట్విస్టుందా? :** కవితలాగే ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇటీవల బెయిల్ వచ్చినట్లే వచ్చి ఆగిపోయింది. ఈడీ కేసులో బెయిల్ వచ్చినా సీబీఐ ప్రవేశంతో బయటకు రాలేకపోయారు. మళ్లీ ఇప్పుడు కవిత విషయంలో అదే జరుగుతుందా? అనేది చూడాలి. ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని అటు ఈడీ, ఇటు సీబీఐ రెండూ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

## మున్సిపల్ కార్పొరేషన్!

చేస్తున్న ప్రయత్నాలు క్రమంగా ఫలమిస్తున్నాయి. దీంతో ఇవాళ మరో నగర పాలక సంస్థ వైసీపీ నుంచి టీడీపీ చేతుల్లోకి రాబోతోంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరేందుకు మేయర్, కార్పోరేటర్లు సిద్ధమయ్యారు. మోదీ హయాంలో మారిన కాశ్మీర్ ముఖచిత్రం.. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఏలూరు కార్పోరేషన్ లోని 50 సీట్లలో 47 సీట్లలో వైసీపీ గెలిచి క్లీన్ స్వీప్ చేసింది. అయితే మూడేళ్ల పాటు అధికారం అనుభవించిన కార్పోరేటర్లు ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తామూ ప్లేటు ఫిరాయించేస్తున్నారు. మేయర్ నూర్జహాన్ తో పాటు పలువురు వైసీపీ కార్పోరేటర్లు ఇప్పటికే వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. ఇవాళ వారు చంద్రబాబు, లోకేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోబోతున్నారు. అనంతరం ఏలూరు కార్పోరేషన్ పై టీడీపీ పట్టు బిగించబోతోంది. అప్పులు తీర్చడానికి మళ్ళీ అప్పులు ..ఏపీ మంత్రి క్లారిటీ ఎట్టకేలకు వినేష్ ఫొగట్‌కు పతకం ఇప్పటికే ఏలూరులో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి ఆళ్ల నాని ఈ మధ్యే వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. ఆయనతో పాటు బొద్దాని శ్రీనివాస్, మంచం మైబాబు వంటి నేతలు కూడా పార్టీని వీడారు. వీరిలో ఆళ్ల నాని మినహా మిగిలిన వారంతా మేయర్, కార్పోరేటర్లతో కలిసి ఇవాళ టీడీపీలో చేరబోతున్నారు. అదే జరిగితే ఏలూరు కార్పోరేషన్ లో టీడీపీ అనధికారికంగా పాగా వేయబోతోంది. మేయర్ పదవి కొనసాగింపుతో పాటు పలు హామీలు టీడీపీ నుంచి లభించడంతో నూర్జహాన్ ఇలా ప్లేటు ఫిరాయిస్తున్నట్లు తెలుస్తోంది.

## నాయకులు..!

చాలా మంది నాయకులు... అంబటి అనుచరులుగా ముద్రవేసుకున్న వారు.. తాజాగా.. స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు.. కన్నా లక్ష్మీనారాయణకు జై కొడుతున్నారు. నకరికల్లు మాజీ వైసీపీ జడ్పీటీసీ, అంబటి ప్రదాన అనుచరుడు, నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన రాఘవరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక, ఈయన వెంటనే రాఘవరెడ్డి ప్రధాన అనుచరుడు కొండా మురళీధర్ రెడ్డి అలియాస్ కేబుల్ మురళి కూడా ఎమ్మెల్యే కన్నా సమక్షంలో టీడీపీలో చేరుతున్నారు. కొన్నాళ్లుగా ఇక్కడి రాజకీయాలు స్తబ్దుగా ఉన్నాయి. ముఖ్యంగా కేబుల్ వ్యాపారంలో ఉన్న వైసీపీ నాయకులకు అధికార పార్టీ నుంచి షాక్ తగులుతోంది. దీంతో తమ వ్యాపారాలు దెబ్బతింటే.. అసలు మనుగడే ప్రశ్నార్థకమవుతుందని గుర్తించిన నాయకులు.. పార్టీ మారిపోయేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలోనే నకరికల్లు డిష్ టీవీని టీడీపీ వాళ్లు తీసివేస్తారని.. వచ్చే రోజుల్లో తమ బిజినెస్ మరింత డల్ అయిపోతుందని గుర్తించిన నాయకులు టీడీపీలోకి వెళ్లాలంటూ.. రాఘవ రెడ్డి సలహా మేరకు పార్టీ మారుతున్నట్టు తెలిసింది. టీడీపీ కార్యకర్తలు కూడా వీరిని ఆహ్వానిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు అంబటికి అనుచరులుగా ఉన్నవారు.. ఇప్పుడు ఆయన పట్టించుకోకపోవడంతో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా పార్టీ మారితే బెటర్ అనుకుంటున్నారు. ఎన్నికల తర్వాత గెలిచిన పార్టీలో చేరడం.. ఇక్కడ కామనే. గతంలో కూడా ఇలానే చేశారు. మరోవైపు.. వచ్చే రోజుల్లో ఫైబర్ నెట్‌ను మరింత విస్తరించాలని సర్కారు నిర్ణయించుకున్న దరిమిలా.. తమపై ప్రభావం మరింత పడుతుందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే సమక్షంలో వారు టీడీపీ జెండా కప్పుకొనేందుకు రెడీ అవుతున్నారు. అయితే.. ఇంత జరుగుతున్నా.. అంబటి మాత్రం సైలెంట్‌గానే ఉన్నారు. ఆయన కు తెలియదా? అంటే తెలుసు. కానీ, ఏమీ చేయలేని నిస్సహాయత ఇప్పుడు అంబటిని చుట్టుముట్టిందని టాక్ వినిపిస్తోంది.

## పెరుగుతోందా ?

చేసినోడే. ఈ చిన్న విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిస్ అయ్యారా? అన్నదిప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రేవంత్ కు ముందు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కేసీఆర్ ను తీసుకుంటే.. ఆయన పదేళ్ల పాలనలోనూ.. దానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలోని ఎంతో మంది ముఖ్యమంత్రులు తొందరపడని ఒక అంశం మీద రేవంత్ దూసుకెళ్లిపోవటం.. బుల్డోజర్ల తరహాలో వ్యవహరిస్తున్న హైడ్రా వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. అక్రమార్కుల అక్రమాల విషయంలో వేలు పెట్టటాన్ని ఎవరూ తప్పు పట్టరు. ఎందుకుంటే.. ఎవరో ఒకరు ఎక్కడో ఒక దగ్గర కల్పించుకోవాల్సిందే. కానీ.. దానికి అవసరమైన ఆయుధాల్ని సిద్ధం చేసుకొనే రేవంత్ హైడ్రాను రంగంలోకి దించారా? అన్నది అసలు ప్రశ్న. చెరువుల్ని కాపాడటమే తమ ధ్యేయంగా.. చెరువు ఆయుకట్టలను సంరక్షించటమే లక్ష్యంగా హైడ్రా అనే వ్యవస్థను తెర మీదకు తీసుకొచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా.. అక్రమ కట్టడాల్ని నిర్దిరించటం.. ఆ వెంటనే కొట్టేయటం లాంటి అంశాల్లో న్యాయపరమైన చర్యల్ని సైతం హైడ్రానే తీసుకోవటం.. వెనుకా ముందు చూసుకోకుండా విరుచుకుపడటం ఇప్పటివరకు చూస్తున్నాం. ఇక్కడే పెద్ద తలనొప్పి ఉంది. చెరువుల ఎఫ్ టీఎల్.. బఫర్ జోన్ లకు సంబంధించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని అనుమతి లేని నిర్మాణాలను కూల్చేస్తున్న హైడ్రా.. కొన్ని వ్యవస్థలు (అది హెచ్ ఎండీఏ కావొచ్చు జీహెచ్ఎంసీ కావొచ్చు) అనుమతులు ఇచ్చిన తర్వాత నిర్మించిన వాటిపైనా విరుచుకుపడటం ప్రశ్నగా మారింది. ఒకరు చేసిన తప్పునకు వేరే వారు ఎందుకు బలి కావాలి? అన్నది ఇక్కడ ప్రాథమిక ప్రశ్న. ఒక వ్యవస్థకు చెందిన ఒక విభాగం ఇచ్చిన అధికారిక అనుమతుల్ని అసరాగా చేసుకొని నిర్మాణం చేసినప్పుడు.. ఇప్పుడు అదే వ్యవస్థకు చెందిన మరో విభాగం వచ్చి మీరు చేసింది తప్పు అంటూ.. కూల్చేసేందుకు అవసరమైన తీర్పును ఇన్ స్టెంట్ గా ఇచ్చేయటంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. సంపన్నులైనా.. సామాన్యులైనా ఒకే తీరును ప్రదర్శిస్తామని చెబుతున్న హైడ్రాను నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచిత్రమైన పరిస్థితుల్లో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఆయన తీసుకొచ్చిన హైడ్రాను కురుక్షేత్ర యుద్ధంగా పేర్కొంటూ.. అందులో పోరాటం చేస్తున్న రేవంత్ ను కొందరు అర్జునుడిగా పోలుస్తుంటే.. మరికొందరు అభిమన్యుడిగా వ్యవహరిస్తున్నారు. కురుక్షేత్రంలో పద్మ వ్యూహాన్ని ఛేధించే శక్తి ఉన్న ఈ ఇద్దరిలో.. అభిమన్యుడికి వెళ్లటం వరకు తెలుసు. తిరిగి రావటం తెలీదు. అదే సమయంలో అర్జునుడికి రెండు తెలిసినా.. వెళ్లి వచ్చే వరకు వెళ్లరు. ఇక్కడ రేవంత్ వెళ్లటం వరకైతే వెళ్లిపోయారు. ఆ తర్వాతేమిటి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇదే అంశాన్ని సీపీఎం నారాయణ తనదైన శైలిలో చెబుతూ.. హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పులిస్వారీ మొదలు చేశారని.. దాన్ని కొనసాగిస్తారో.. లేదన్నది ఆయనపైనే ఉంటుందని చెబుతున్నారు. స్వారీ ఆపకుంటే పులికి ఆహారం కావాల్సి ఉంటుందని.. కొనసాగింపు అంత తేలికైనది కాదన్న వాదనను వినిపిస్తున్నారు. సమాజంలో అత్యంత బలవంతులతో యుద్ధానికి దిగే విషయంలో వెనుకా ముందు ఆడకుండా నిర్ణయం తీసుకోవటం వరకు సరే. కానీ.. అలా తీసుకునే ముందు న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా అవసరమైన ప్లానింగ్ ఎంతమేర ఉందన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే రేవంత్ పై కొత్త సందేహాలు వ్యక్తం చేసేలా మారాయి.

## మోడీ రిటర్న్ జర్నీ

మధ్యవర్తిత్వాన్ని నడిపేందుకు సిద్ధమని చెప్పటం తెలిసిందే. కట్ చేస్తే.. ఉక్రెయిన్ లో మోడీ ఉన్నంత కాలం ఒక్కసారి కూడా యుద్ధ సైరన్ మోగకపోవటం.. రష్యా నుంచి ఎలాంటి దాడులు లేకుండా.. ప్రశాంతంగా ఉన్న దానికి బదులుగా సోమవారం ఉక్రెయిన్ పరిస్థితి దారుణంగా మారినట్లు చెబుతున్నారు. ఉక్రెయిన్ పర్యటన ముగించుకొని మోడీ బయలుదేరిన కొన్ని గంటల వ్యవధిలోనే ఆ దేశ రాజధాని కీవ్ తో పాటు పలు చోట్ల రష్యా తన క్షిపణులతోనూ.. డ్రోన్లతోనూ దాడులకు దిగింది. దీంతో.. పేలుళ్ల శబ్దాలు కీవ్ లో కొన్ని గంటల పాటు చోటు చేసుకున్నాయి. ఈ దాడులతో పలు భవనాలు దెబ్బ తినటంతో ఆస్తి నష్టమే కాదు ప్రాణనష్టం కూడా వాటిల్లినట్లుగా తెలుస్తోంది. తమ దేశంపై రష్యా వంద క్షిపణులు.. వంద డ్రోన్లతో భీకర దాడికి పాల్పడినట్లుగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వెల్లడించారు. ఈ రెండు దేశాల మధ్య దాడులు మొదలైన తర్వాత జరిగిన అతి పెద్ద దాడుల్లో సోమవారం చోటు చేసుకున్న దాడులు ఒకటిగా పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల్ని టార్గెట్ చేస్తూ ఈ దాడులు జరిగినట్లుగా ఉక్రెయిన్ వాపోతోంది. రష్యా దాడుల కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం చోటు చేసుకుందని.. దీన్ని పునరుద్ధరించే పనులు సాగుతున్నట్లుగా చెబుతున్నారు. రష్యా చర్యల్ని తిప్పి కొట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు జెలెన్ స్కీ వెల్లడిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. ఉక్రెయిన్ లోని తూర్పు.. దక్షిణ ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల్ని లక్ష్యంగా చేసుకొని రష్యన్ బలగాలు బాంబుల వర్షం కురిపించినట్లుగా ఉక్రెయిన్ వెల్లడించింది. రష్యా చేస్తున్న దాడుల్ని సమర్థంగా అడ్డుకునేందుకు వీలుగా యూరోపియన్ దేశాలు సాయం చేయాలని కోరిన ఉక్రెయిన్ అధ్యక్షుడు.. రష్యా క్షిపణులు.. డ్రోన్లను కూల్చేందుకు పొరుగున ఉన్న దేశాలు కలిసికట్టుగా సాయం చేయాలన్నారు. ఇలా జరిగితే.. తమ దేశ పౌరుల్ని రక్షించుకునే వీలుందన్నారు. రెండేళ్లకు పైగా రష్యా - ఉక్రెయిన్ మధ్య యుద్ధం సాగుతోంది. రెండు దేశాలు.. ఒకరిపై ఒకరు దాడులకు తెగ బడుతున్నాయి. ఈ దాడుల వల్ల ఉక్రెయిన్ కు జరిగిన నష్టం భారీగా చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని వేల మంది పౌరుల్ని.. సైనికుల్ని ఆ దేశం కోల్పోయింది. ఇక.. ఆస్తి నష్టం గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఒకవేళ.. యుద్ధం ముగిసినా.. ఆ దేశం కోలుకొని తిరిగి తమ పూర్వ స్థితికి చేరుకోవటానికి కనీసం కొన్ని దశాబ్దాల కాలం పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. రష్యాలోని కస్క్ రీజియన్ లోని మరో రెండు ప్రాంతాలు తమ అధీనంలోకి వచ్చినట్లుగా ఉక్రెయిన్ పేర్కొనటం గమనార్హం. తమ బలగాలు మూడు కిలోమీటర్ల దూరం దూసుకెళ్లినట్లుగా చెప్పారు. రష్యా దాడుల్ని తీవ్రంగా ఎదుర్కొనే ప్రయత్నం చేసిన ఉక్రెయిన్.. తమకున్న పరిమిత వనరులతో రష్యా మీద వరుస డ్రోన్లతో విరుచుకుపడింది. రష్యాలోని సరతోవ్.. యూరోస్లావ్ తో సహా మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో 22 డ్రోన్లతో దాడులకు దిగినట్లుగా రష్యా పేర్కొంది. వీటిల్లో 20 డ్రోన్లను తాము కూల్చేసినట్లు రష్యా వెల్లడించింది. ఇక.. రష్యాలోని సరతోవ్ లోని ఎత్తైన భవనంలోకి ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్ దూసుకెళ్లింది. ఇది గతంలో తాలిబన్లు అమెరికా ట్విన్ టవర్ ను ఢీ కొట్టిన తరహాలో ఉంది. కాకుంటే.. డ్రోన్ ను ప్రయోగించిన కారణంగా.. నష్టం పరిమితంగా ఉందంటున్నారు. భవనంలో కొద్ది భాగమే దెబ్బ తిందన్న సమాచారం వెల్లడైంది.

## 7 కొత్త ఎయిర్‌పోర్ట్‌లు

ఎక్కించేస్తున్నారు. చాలా దూరదృష్టితోనే రామ్మోహన్ ఆలోచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. రానున్న అయిదు పదేళ్లలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుంది. దాంతో డొమెస్టిక్ ఏరోప్లేన్ ల అవసరం పడుతుంది. గతంలో కూడా డెస్టినేషన్ ఫ్లైట్స్ అంటూ ఒక చర్చ సాగింది. టైర్ టూ సిటీలలో వాటిని ఏర్పాటు చేయడం ద్వారా మధ్యతరగతి ప్రజలను కూడా విమానం ఎక్కించి వారి జీవిత కాలం కోరిక తీర్చాలని ప్రభుత్వాలు ఆలోచించాలి. ఇపుడు అది కార్యరూపం దాల్చేలా కనిపిస్తోంది అని అంటున్నరు. ఏకంగా ఏపీకి ఏడు కొత్త ఎయిర్ పోర్టులు రాబోతున్నాయని కేంద్ర మంత్రి రామ్మోహన్ ప్రకటించారు. అలా ఏపీలో 7 కొత్త ఎయిర్‌పోర్ట్‌ల ఏర్పాటుకు సర్వే చురుగ్గా సాగుతోందని ఆయన తెలిపారు. శ్రీకాకుళం,అన్నవరం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్ కుప్పం, ఒంగోలు-నెల్లూరు, అనంతపురంలో కొత్త ఎయిర్ పోర్ట్ ల ఏర్పాటుకు పరిశీలన జరుగుతోందని ఆయన వివరించారు. అంతే కాదు ఏపీలో త్వరలో సీ ప్లేన్ కార్యకలాపాలు ప్రారంభిస్తామని మరో శుభవార్తను చెప్పారు. అలా మొట్టమొదటి సీ ప్లేన్ డెమో సైతం ప్రకాశం బ్యారేజీ నుంచి శ్రీశైలం వరకు నిర్వహిస్తామని అన్నారు. ఇక ఏపీలో విమానాశ్రయాల సామర్థ్యం పెంచుతున్నామని కూడా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. ఇది ఒక విధంగా మంచి పరిణామమే అంటున్నారు. శ్రీకాకుళం జిల్లా వాసులకు ఎయిర్ పోర్టు కల తీరడం అంటే గ్రేటే అనుకోవాలి. అలాగే టీర్ టూ సిటీస్ నుంచి ఎయిర్ కనెక్టివిటీ పెరిగితే రూరల్ ఎకానమీ కూడా బాగా పెరుగుతుందని అంటున్నారు. ఒక చోట నుంచి పండిన పంటను మరో చోటకు కూడా కార్గో ఎయిర్ ప్లేన్ ల ద్వారా తీసుకుని వెళ్లవచ్చు. అంతే కాదు మార్కెటింగ్ స్పేస్ బాగా పెరుగుతుంది. ఇక టూరిజం కి ఇది ఊతం ఇస్తుంది అని అంటున్నారు. దూరం తగ్గి టైం మిగిలితే అదే ఎకానమీని పెంచే సరికొత్త సాధనం అవుతుంది అని అంటున్నారు.

## గుడ్‌న్యూస్ !

అందజేస్తోంది. తాజాగా రాష్ట్రంలోని రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులను తీసుకువచ్చింది. రాష్ట్రంలో ఎంతోమంది రైతులు పశుపోషణ చేస్తున్నారు. వాటికి అవసరమైన దాణా కొనుగోలుతోపాటు పశువులను కొనుగోలు చేసేందుకు ఆర్థిక ఇబ్బందులవల్ల వెనకడుగు వేస్తుంటారు. ఇలాంటివారిని ఆదుకునేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులను కేంద్రం తీసుకువచ్చింది. పశు సంవర్థక శాఖ కు చెందిన అధికారులు, సిబ్బంది సంబంధిత బ్యాంకు యాజమాన్యంతో సమన్వయం చేసుకొని అర్హులైన రైతులకు వీటిని మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వీటిని జారీచేయగా, మరికొన్ని జిల్లాల్లో జారీచేయాల్సి ఉంది. ఈ క్రెడిట్ కార్డులద్వారా బ్యాంకులు రైతులకు రూ.1.60 లక్షల వరకు ఇస్తాయి. అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకొని పాల విక్రయాన్ని పెంచుకోవాలి. వాటి ఆదాయంద్వారా వచ్చిన డబ్బును తిరిగి 40 రోజుల్లోగా చెల్లించడానికి అవకాశం ఉంది. ఇలా 40 రోజుల్లోనే చెల్లించడంవల్ల వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. వీటిద్వారా అదనపు పశువులను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. అంతేకాదు.. ఈ కార్డులతో ఆన్ లైన్ చెల్లింపులు చేయవచ్చు. జాగ్రత్తగా ఉపయోగించుకుంటే ఎటువంటి వడ్డీ భారం లేకుండా ఆర్థిక అవసరాలన్నీ తీరతాయి.

40 రోజులు దాటితే ఏడు శాతం వడ్డీ2

40 రోజుల దాటిన తర్వాత చెల్లిస్తే ఏడుశాతం వడ్డీని వసూలు చేస్తారు. అందులో మూడు శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. అంటే రైతు కేవలం నాలుగు శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. కేంద్ర ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ ద్వారా రూ.3 లక్షల రుణాన్ని నాలుగు శాతం వడ్డీకి అందజేస్తోంది. ఇందులో రూ.1.6 లక్షల వరకు ఎటువంటి హామీ అవసరంలేదు. రైతులకు ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు అతి తక్కువ వడ్డీ ధరలకు చాలా సులువుగా వీటిద్వారా రుణాలను పొంది ఉర్థికంగా ఉపశమనం పొందొచ్చు.

## గల్లా చూపు !

జయదేవ్ కు చెందిన పరిశ్రమల పట్ల తీవ్ర వేధింపులకు పాల్పడిందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర అసహనానికి గురయిన గల్లా జయదేవ్ ఏపీలో నెలకొల్పాలనుకున్న అమర్ రాజా బ్యాటరీస్ కొత్త ప్లాంట్ ను తెలంగాణకు తరలించేశారు. రూ.7,500 కోట్ల విలువైన పెట్టుబడులను ఈ ప్లాంట్ కింద ఆ రాష్ట్రంలో గల్లా జయదేవ్ పెట్టారు. ఈ వ్యవహారం పారిశ్రామికవర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధిస్తోందనే ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. రాజకీయాల్లో ఉన్న పారిశ్రామికవేత్తలను అధికారంలో ఉన్న ప్రత్యర్థి పార్టీలు వేధిస్తున్నాయని గల్లా జయదేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఇటీవల ఎన్నికల నుంచి స్వచ్ఛంధంగా తప్పుకున్నారు. ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలిపారు. అయితే టీడీపీలోనే కొనసాగుతానని వెల్లడించారు. దీంతో గుంటూరు ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్ కు చంద్రబాబు అవకాశమిచ్చారు. కాగా ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉండటంతో గల్లా జయదేవ్ రాజ్యసభ సీటును ఆశిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. 2026లో ఏపీకి సంబంధించి రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఇందులో ఒక సీటుపై ఆయన కన్నేశారని చెబుతున్నారు. ఇప్పటికే తన మనసులో మాటను చంద్రబాబుకు సైతం చేరవేశారని అంటున్నారు. చంద్రబాబు సైతం గల్లా జయదేవ్ కోరికకు సమ్మతించారని అంటున్నారు. రెండుసార్లు లోక్ సభ ఎంపీగా పనిచేయడంతోపాటు దేశంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా గల్లా జయదేవ్ ఉన్నారు. అయితే 2026 వరకు రాజ్యసభ సీట్లు ఖాళీ అయ్యే పరిస్థితి లేదు. ఈ క్రమంలో ముందుగా గల్లా జయదేవ్ ను ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తారని అంటున్నారు.

## ప్రభుత్వ భూములే కాదు..
# అడవులు కూడా వదల్లేదు
### చంద్రబాబు, పవన్ ఆరా



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములు, డీకేటీ భూములు, కాలువ భూములు, వంకలు, వాగులు కబ్జాలు చేశారని ఆ పార్టీ నాయకులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ భూములతో పాటు అడవులు కూడా వైసీపీ నాయకులు కబ్జా చేశారని, అటవి ప్రాంతాలను కూడా ఆక్రమించారని వెలుగు చూడడం హాట్ పిక్ అయ్యింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు అడ్డంగా ప్రభుత్వ భూములు దోచుకున్న వైసీపీ నాయకులు ఎవరెవరు ?అంటూ ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న హయాంలో రాయలసీమలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇలా ఇతర పార్టీల నాయకులు ఆరోపణలు చెయ్యడం సర్వసాదారణం అయ్యింది. పలు ప్రాంతాల్లో వైసీపీ నాయకుల కబ్జాలను ఆధారాలతో సహ బయటపెడుతున్నారు. రోదసిలో సబ్ కలెక్టర్ ఆఫీసులోకి సీఐడీ చీఫ్ ఎంట్రీ, సీన్ రీ కనస్ట్రక్షన్, రాత్రి ఏం జరిగింది చెప్పండి రాయలసీమలోని కర్నూలు జిల్లాలో సుమారు 120 ఎకరాల అటవీ ప్రాంతాన్ని కొందరు స్థానికంగా ఉండే వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని వెలుగు చూడడం హాట్ టాపిక్ అయ్యింది. కర్నూలు జిల్లాలోని బేతంచెర్ల మండలంలోని సీతాపురం గ్రామ పరిధిలో అటవీ ప్రాంతం ఉంది. గత రెండేళ్ల నుండి అటవీ ప్రాంతాన్ని కొంచెం కొంచెం భూమిని కబ్జా చేశారని వెలుగు చూసింది. ఇప్పటికే ఆ ప్రాంతంలోనే టీడీపీ, జనసేన నాయకులు కూటమి ప్రభుత్వానికి ఈ విషయంపై సమాచారం ఇచ్చారు. సుమారు 120 ఎకరాల అటవీ ప్రాంతంలోని చెట్లను కొట్టేసి, అక్కడ ఉన్న రాళ్లను చదును చేసిన కొందరు వైసీపీ నాయకులు ఆ భూముల్లో పంటలు పెట్టుకుంటున్నారని వెలుగు చూసింది. ఈ 120 ఎకరాల అటవీ ప్రాంతంలో టేకు చెట్లు, పెద్ద పెద్ద రాళ్లు ఉండేవని స్థానికులు అంటున్నారు. టేకు చెట్లు పూర్తిగా కొట్టేసిన తర్వాత అటవి శాఖలోని కొందరితో కుమ్మక్కు అయ్యి వాటిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించారని తెలిసింది. కలలో కూడా అనుకోలేదు అడ్డంగా బుక్కైపోతాడని, వైసీపీ ఎమ్మెల్సీ వీడియో నిజమేనా ? అటవి ప్రాంతంలోని రాళ్లను అక్కడి నుండి తొలగిం,చి ఆ భూమిని చదును చేశారు. ఆ తర్వాత అటవి శాఖ సిబ్బందితో కొమ్మక్కు అయ్యి టేకు చెట్లు మొత్తం విక్రయించారని వెలుగు చూసింది. చదును చేసిన అటవీ భూమిలో చామంతి పూలు, చిక్కుడు కాయలు, కందులు, చీని తోటలు పంటలు వేసి సాగు చేస్తున్నారని వెలుగు చూసింది. కొంతమంది వైసీపీ నాయకులు గ్రూపులుగా ఏర్పడి సుమారు 120 ఎకరాల అటవీ ప్రాంతాన్ని ఆక్రమించారని వెలుగు చూసింది. ఈ విషయంపై పెద్ద ఎత్తున ఆరోపణలు కూడా రావడంతో ఆలస్యంగా కళ్ళు తెరిచిన అటవీ శాఖ అధికారులు విచారణ మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు నివేదిక కోరడంతో అటవీ శాఖ అధికారులు సతమతం అవుతున్నారని తెలిసింది. కర్నూలు జిల్లా అటవీ శాఖ అధికారులు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వానికి నివేదిక సమర్పించడానికి సిద్ధం అవుతున్నారని తెలిసింది. కర్నూలు జిల్లాలోని అటవి ప్రాంతం భూముల వ్యవహారం గురించి సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీస్తున్నారని సమాచారం.

## ఏలూరులో వైసీపీకి భారీ షాక్ !

వీరిందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటమి నుంచి వైకాపా గుణపాఠం నేర్చుకోలేదని, ప్రజా ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు.

## వివాస్పద వ్యాఖ్యలు సరికాదు

నాయకులు కార్యకర్తలు కూనవరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు అనంతరం జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎంపీపీ పాయం రంగమ్మ సర్పంచులు సున్నం అభిరామ్ కట్టం లక్ష్మి వైఎస్ఆర్సిపి మండల నాయకులు ఆవుల మర్యాద దాసు విఆర్ పురం మండల ప్రెసిడెంట్ మాదిరెడ్డి సత్తిబాబు మాజీ వైస్ ఎంపీపీ గుజ్జ బాబు కార్పొరేషన్ డైరెక్టర్ దీకొండ లక్ష్మీప్రసాద్ గంగాధర్ కొమ్మని మోహన్ రావు వి ఆర్ పురం మాజీ మండల ప్రెసిడెంట్ పోడియం గోపాల్ కొమ్మని సునీత బత్తుల వెంకటేశ్వర్లు సూరం సాయి కొండారపు రమేష్ నోముల సత్యనారాయణ నందికొండ సత్యనారాయణ మిరియాల రమేష్ కుంజ శ్రీను మహేంద్ర తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంత బాబు పై కూనవరనికి చెందిన టిడిపి కార్యకర్త చెలికాని ఉమా చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు వ్యక్తిగత దోషములు మానుకోవాలని హితవు పలికారు ఒక వార్డ్ మెంబర్ కూడా పోటీ చేయనివాడు ఎమ్మెల్సీ అనంతబాబుని ఉరితీయాలి అనటం సిగ్గుచేటు అన్నారు స్థాయిని మరిచి వివాస్పద వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు వైఎస్ఆర్సిపి పార్టీపై నాయకులు పై కార్యకర్తలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఉమాని తక్షణమే అరెస్టు చేయాలని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూనవరం పోలీస్ స్టేషన్ లో వైసీపీ నాయకులు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు పోలీసు ఉన్నత అధికారులు సీఐ ఏఎస్పి అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అదుపులో తీసుకోవాలని వైసిపి పార్టీ తీవ్రంగా ఖండించింది

## రాజకీయం !

ఆ పార్టీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే ఏలూరు నియోజకవర్గంలోనూ నాయకులు తమ దారి తాము చూసుకుంటున్నారు. ఇప్ప టికే కీలక నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా, ఏలూరు నగర మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరనున్నట్టు తెలిసింది. వాస్తవానికి ఈ విషయం ఆళ్లకు తెలుసునని అంటున్నారు. అన్నీ తెలిసిన తర్వాతే.. వారిని ఆపడం తన వల్లకాదని నిర్ణయించుకున్న తర్వాతే.. పార్టీకి, రాజకీయాలకు కూడా దూరమయ్యారు. ఏలూరు టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్ సమక్షంలో చేరుందుకు వైసీపీ కీలక నాయకులు నూర్జహాన్, పెద్దబాబు.. వారి అనుచరులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. వీరితో పాటు ఏలూరు నగరానికి చెందిన మరో 39 మంది కీలక నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. వారితో ఇప్పటికే ఎమ్మెల్యే సంప్రదింపులు చేశారు. ఈ క్రమంలోనే వారి చేరికలకు పార్టీ అధినేత చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. మేయర్ నూర్జహాన్, పెదబాబుల రాజకీయ జీవితం టీడీపీతోనే మొదలైంది. 2013లో టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బడేటి బుజ్జి సమక్షంలో వీరు టీడీపీలోకి వచ్చారు. నగర పాలక సంస్థ ఎన్నికల సమయంలో నూర్జహాన్‌ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో నూర్జహాన్ విజయం సాధించి మేయర్ పీఠాన్ని దక్కించుకుంది. తర్వాత జరిగిన పరిణామాల్లో 2019 ఎన్నికల సమయంలో వీరిద్దరూ వైసీపీలోకి వెళ్లారు. దీంతో మరోసారి మేయర్ పదవి వరించింది. ఇప్పుడు తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు.

## ఎడిటర్ వాయిస్

# వికాసం తెలుగు

'సంస్కృతంబులోని చక్కెర పాకంబు/ అరవ భాషలోని అమృతరాశి/ కన్నడంబులోని కస్తూరి వాసన/ కలిసిపోయె తేట తెలుగునందు' అంటారు మిరియాల రామకృష్ణ. భారతదేశంలోని అతి ప్రాచీన భాషల్లో తెలుగు ఒకటి. ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది మాట్లాడే భాష తెలుగు. లిపి వున్న 6 వేలకు పైగా భాషల్లో..అందమైన లిపివున్న రెండో భాష తెలుగు. 15వ శతాబ్దిలో వినుకొండ వల్లభ రాయుడు-'జగతి దల్లికంటె సౌభాగ్య సంపద/ మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె' అని తెలుగు ప్రాశస్త్యాన్ని కొనియాడినా.. 'తెలుగదేలయన్న దేశంబు తెలుగేను/ తెలుగు వల్లభుండ తెలుగొకండ/ ఎల్ల నృపులు గొల్వ ఎరుగవే బాసాడి/ దేశ భాషలందు తెలుగు లెస్స' అని కన్నడ ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాష కీర్తిని హిమాలయ శిఖరాగ్రాన నిలిపాడు. అయితే, గ్రాంథిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి, వ్యవహారిక భాషలో వున్న సౌందర్యాన్ని, సౌలభ్యాన్ని తెలుగు భాష ఆవాహన చేసుకునేలా భాషోద్యమానికి శ్రీకారం చుట్టిన మూలపురుషుడు గిడుగు రామ్మూర్తి. అందుకే- 'గ్రాంథికమ్ము నెత్తిన పిడుగు గిడుగు/ వ్యవహార భాషోద్యమ స్థాపక ఘనుడు గిడుగు/ తేట తేనియల తెల్లని పాల మీగడ గిడుగు/ కూరి తెలుగు భాషకు గొడుగు గిడుగు' అన్నారు. పులిదిండి మహేశ్వర్. మనిషి నుంచి పుట్టిన భాషౖ% కేవలం మాటల వారధి మాత్రమే కాదు, మన మూలాలను తెలియజెప్పి, ముందుకు నడిపే సారథి. ఆట, పాట, మాట, సంగీతం, కళలు, పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలు ఏవైనా భాష లేకుండా పెంపొందలేవు. మాతృభాష ఏదైనాౖ%అది తల్లితో సమానం. తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేనట్లుగానేౖ%అమ్మ భాషకూ ప్రత్యామ్నాయం లేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉపాధి కోసం నేర్చుకోవాల్సి వచ్చిన ఆంగ్లభాషౖ%స్థానికతను, ఉనికిని, మాతృభాషను మింగేసే స్థాయికి చేరింది. ఫ్రాన్స్, స్పెయిన్, చైనా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంజనీరింగ్, వైద్యశాస్త్రం వంటి కోర్సులన్నీ వారి స్థానిక భాషల్లోనే చెబుతున్నారు. విజ్ఞాన శాస్త్రాలను మాతృభాషలోనే చదువుకుంటున్నారు. ప్రపంచంలోని దాదాపు 110 దేశాల కంటే మన తెలుగునేల పెద్దది. చాలా యూరోపియన్ భాషలు కూడా తెలుగుకంటే చిన్నవే. కానీ, వాటికున్న గౌరవ మర్యాదలు తెలుగు భాషకు ఇవ్వడంలేదు. వేరే దేశాల్లో, ప్రాంతాల్లోౖ%తెలుగు వచ్చిన వారితో తెలుగులో మాట్లాడాలన్నా కూడా ఆత్మన్యూనతా భావానికి గురయ్యే పరిస్థితి తెలుగోళ్లది. 'తెలుగువాడివై తెలుగు రాదనుచు/ సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా/ అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు/ సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా' అంటారు కాళోజీ. పరభాషా వ్యామోహంలో కొట్టుకుపోతూ మాతృభాషను విస్మరించే వారికి ఇంతకంటే గొప్ప హెచ్చరిక ఏముంటుంది? తెలుగులో చదవడం, మాట్లాడటం ఓ అభిరుచి కావాలి. కొత్త పదాల సృష్టి జరగాలి. తెలుగు భాషలో సహజంగా ఇమిడిపోయే పదాలను ఆహ్వానించాలి. తెలుగు భాషను నేర్చుకోవడం, తెలుగు సంస్కృతిని పెంపొందించుకోవడం తద్వారా తెలుగు భాషను బతికించుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత. 'పరభాషా జ్ఞానాన్ని సంపాదించు/ కాని నీ భాషలోనే నువ్వు సంభాషించు/ తల్లి తండ్రి నేర్పినట్టి మాతృభాషరా/ తెలుగు మాట్లాడి వాళ్ల ఋణం/ తీర్చరా' అంటాడు సినీకవి చంద్రబోస్. ప్రజలు కార్పొరేట్ స్కూళ్ల మాయలో పడి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ఆశల సౌధాల్లో చిక్కిౖ%అటు మాతృభాష, ఇటు పరభాష-ఏదీ సరిగా నేర్చుకోలేని దుస్థితి నుంచి కాపాడాల్సిన బాధ్యత తెలుగు ప్రభుత్వాలదే. ప్రాథమిక స్థాయి నుంచే విద్యను మాతృభాషలో నేర్పించాలి. విజ్ఞాన శాస్త్రాలను తెలుగు భాషలోకి తర్జుమా చేయగలిగితే, తెలుగులోనే చదువుకునే అవకాశం లభిస్తుంది. పిల్లలకు మాతృభాషలో అందించే విజ్ఞానం తరతరాలకూ చేరుతుంది. గిడుగు వారి వారసత్వాన్ని భవిష్యత్తరాలకు అందించాల్సిన బాధ్యత మనది. ఆగస్టు 29 'తెలుగు భాషా దినోత్సవం' సందర్భంగా వివిధ సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇవి తెలుగు భాష వికాసానికి దోహదపడతాయని ఆశిద్దాం.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ముసురుకుంటున్న అంటువ్యాధులు



మేఘాలయలో తాజాగా ఒక పోలియో కేసు వెల్లడి కావడం తీవ్ర ఆందోళనకరం. మీడియాలో పలు కథనాలు రావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న అధికారికంగా రిపోర్టు చేసింది కూడా. కోల్‌కతాలో వైరస్‌ను విసర్జకాల్లో 2022 ఏప్రిల్‌లో గమనించిన విషయం గుర్తు చేసుకోవాలి. దాన్ని జెనెటిక్ సీక్వెన్సింగ్ చేయగా తగినంత రోగనిరోధక శక్తి లేని పిల్లలకు వేసిన వ్యాక్సిన్ వల్ల సంక్రమించినట్టు పరిశోధనలో తేలింది. అయితే మేఘాలయ ప్రభుత్వం ఇప్పటి పోలియో కేసును నిర్ధారించినా ఇంతవరకు ఆ వైరస్ వ్యాక్సిన్ సంక్రమితమైనదా లేక తీవ్ర (వైల్డ్) వైరస్సా అన్నది అధికారికంగా రిపోర్టు చేయకపోవడం శోచనీయం. మన దేశంలో టైప్ 2 వైల్డ్ వైరస్‌ను 2015లోనూ, టైప్ 3 వైల్డ్ వైరస్‌ను 2019లోనూ అంతమొందించినా ఆ తరువాత కూడా టైప్1 వైరస్ అవశేషాలు కనిపించాయంటే అవి విదేశాల నుండి దిగుమతి అయినట్టు భావించక తప్పదు. ఇటువంటి పరిస్థితిలో ఈ ఏడాది ఆగస్టు 13న ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ 14 టైప్1 వైల్డ్ వైరస్ కేసులున్నట్లు ప్రకటించడం ఆందోళనకరం. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం, ఊచకోత పోలియో ప్రబలడానికి కారణమవుతున్నది. టీకాల కార్యక్రమం ఆగిపోవడం వల్ల, మురుగు నీటి వ్యవస్థ విచ్ఛిన్నం కావడం వల్లా యుద్ధానికి ముందు నియంత్రణలో ఉన్న పోలియో, మళ్లీ విజృంభిస్తున్నదని డబ్ల్యు.హెచ్.ఓ చెబుతున్నది. వ్యాక్సిన్ సక్రమంగా ఇవ్వకపోతే వచ్చే 'వ్యాక్సిన్ పోలియో' కూడా కనిపిస్తోంది. సురక్షిత నీరు, శానిటేషన్ లేకపోవడం వల్ల ఇతర అంటువ్యాధులూ పెరుగుతున్నాయి. హెపటైటిస్-ఎ కేసులు బాగా పెరుగుతున్నాయి. అక్టోబర్ నుండి 4000 కేసులు రిపోర్టు అయ్యాయి. వైరస్‌లు మనుషులు పెట్టుకొన్న సరిహద్దులను లెక్కచేయవు. అవి అన్ని వైపులా వ్యాపిస్తాయి. వెంటనే తగిన చర్యలు తీసుకొని వైద్య సేవలు పునరుద్ధరించక పోయినట్లయితే, పౌరులకే కాదు. గాజాకే కాదుఆ ప్రాంతమంతటా ఒక ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటి వరకు, ఇజ్రాయిల్ పాలస్తీనాపై యుద్ధం మొదలెట్టాక 18 లక్షల అంటువ్యాధుల కేసులు రిపోర్ట్ అయ్యాయి. 2003లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణ యుద్ధం తరువాత, సైనికుల్లో అంటువ్యాధులు కనిపించాయి. రెండో ప్రపంచ యుద్ధంలో సైన్యం తరలింపులు, మిలిటరీ క్యాంపులు అంటువ్యాధుల వ్యాప్తికి కావాల్సిన పరిస్థితులు సృష్టించాయి. ఆనాడు, తట్టు (మీజిల్స్), క్షయ (టి.బి) లాంటివి సైనికుల్లో మామూలైపోయి విజృంభిస్తున్న జబ్బుల్ని నియంత్రించడం వీలు కాలేదు. వియత్నాం యుద్ధంలో కూడా ఇదే జరిగింది. మలేరియా, ఇతర ఉష్ణ మండల జబ్బులు చెలరేగాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో ఇన్‌ఫ్లుయంజా మహమ్మారి వచ్చింది. యాంటీబయాటిక్స్‌ను సక్రమంగా వాడకపోతే, డ్రగ్ రెసిస్టెన్స్ వస్తుంది. అంటే సూక్ష్మజీవులు యాంటీబయాటిక్స్ వల్ల నశించడం కాకుండా, వాటికి అలవాటు పడి, తట్టుకొని మరింత శక్తివంతంగా తయారవుతాయి. ప్రస్తుతం మన దేశంలో డ్రగ్ రెసిస్టెంట్ టిబి, మలేరియా విజృంభిస్తున్నాయని వైద్యులు, ప్రజారోగ్య నిపుణులు ఆందోళన ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం మందులు సరిగా సరఫరా చేయకపోవడం ఒక కారణమైతే పోషకాహార లోపం మరో ముఖ్య కారణమని వారంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ యా వ్యాధులను అదుపు చేయడానికి కొత్త మందులు వచ్చినా వాటి ఖరీదు ఎక్కువగా ఉంటోంది. టిబి, మలేరియా బాధితుల్లో అత్యధికులు పేద, మధ్యతరగతి ప్రజలే! తినడానికే ఇబ్బందికర పరిస్థితులుండగా వైద్యం, మందులు వారికి పెనుభారమే అవుతాయి. అంటువ్యాధుల వ్యాప్తికి సరిహద్దులు ఆటంకం కాదని కరోనా మహమ్మారి అందరికీ తెలియజెప్పింది. ఈ నేపథ్యంలో వైరస్‌లను అదుపు చేయడానికి, డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియాల పని పట్టేందుకూ అవసరమైన పటిష్ట చర్యలు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత. ఒకసారి అవి విజృంభిస్తే అదుపు చేయడం చాలా కష్టం కనుక సర్కారు త్వరగా మేలుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలి!






### రావణుడి మరణానికి కారణమైన

# వేదవతి వృత్తాంతం!

శ్రీరాముడి భార్య సీతమ్మ గతజన్మలో వేదవతి అని ఆమె శాపం వల్లనే రావణాసుడి మరణం సంభవించిందని అంటుంటారు. అయితే వేదవతి కథనం ఇలా ఉంది. త్రేతాయుగంలో పరమ పవిత్రమైన హిమవత్పర్వత ప్రాంతంలో ఒక తపోవనం. ఆ తపోవనంలో కులద్విజుడనే ఋషి వేదమార్గంలో శ్రీ హరి ప్రీతికోసం తపస్సు చేస్తున్నాడు. అతడు వేదాధ్యయనం చేస్తూన్న సమయంలో వేదమాత అతనికి ఒక పుత్రికను ప్రసాదించింది. అతడు ఆమెకు వేదవతి అని పేరుపెట్టాడు. ఆమె పెరిగి పెద్దదైంది. ఆమె సౌందర్యం చూసి దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషాదులు మోహించారు. ఆమెను వివాహం చేసుకోవాలని భావించారు. వారు కులద్విజునితో ఆ విషయం ప్రస్తావించారు. అతడు వారి కోరికను సున్నితంగా తిరస్కరించాడు. పితృ దేవునికి వేదవతి నిత్యం పాదసేవలు చేసేది. నిత్యం అతడు "శ్రీపతి నీ పతి అవుతాడు" అంటూ వేదవతిని దీవించేవాడు. ఇలా ఉండగా దంబుడనే రాక్షసుని దృష్టి వేదవతిపై పడింది. ఆ రాక్షసుడు వేదవతిని పొందాలని నిశ్చయించుకొన్నాడు. కులద్విజుని కలిసాడు. తనకు వేదవతితో వివాహం జరిపించమన్నాడు. "దేవదేవుడైన శ్రీ కాంతునికే ఆమె జీవితం అంకితమైంది. నీవంటి రాక్షసుడికి ఆమె భార్యకాదు" అని కులద్విజుడు రాక్షసునితో అన్నాడు. ఆమాటలు విన్న దంబుడు కులద్విజుణ్ణి సంహరించాడు. వేదవతీ తండ్రి అకాలమరణానికి చింతించి, పితృదేవుని సత్సంకల్పం నెరవేర్చాలని నిర్ణయించుకుంది. . తండ్రి దీవెన ఫలించాలని భావించుకొంది. శ్రీనివాసుని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుంది. అందుకోసం తపస్సు చేసింది. మరొకవైపు నాలుగు తలలున్న బ్రహ్మను మెప్పించి, మూడు కన్నులున్న శివుని ఒప్పించి దశకంఠుడు(రావణుడు) వరాలు, విభూతులు పొందాడు. దేవతల రాజైన ఇంద్రుడిని జయించాడు. కుబేరుణ్ణి దోచుకొన్నాడు. అతని పుష్పక విమానాన్ని అపహరించి స్వంతం చేసుకున్నాడు. లంకాధిపతి నిరంతరం పుష్పకవిమానంలో ఆకాశ సంచారం చేస్తూ విహారయాత్రలలో మునులకు తపోభంగం, బలవంతులకు ప్రాణభంగం, పతివ్రతలకు మానభంగం చేస్తూ వినోదించేవాడు. ఇలా రాక్షస వినోదం అనుభవిస్తూన్న రావణుని దృష్టికి తీవ్రంగా తపస్సు చేస్తున్న మహా సౌందర్యవతి వేదవతి కనిపించింది. వెంటనే రావణుని పుష్పకవిమానం వేదవతి ఆశ్రమంలో నిలచింది."ఇది నిర్జన పర్వత ప్రాంతం. నావంటి వారిని అనుగ్రహించవలసిన సౌందర్యదేవతవు నీవు. నీవు ఏ దేవత అనుగ్రహం కోసం తపస్సు చేస్తున్నావు? నీవు కుమారివా? శ్రీమతివా? నీ తల్లి తండ్రులెవరు? నీ చరిత్ర....ఏంటి" అంటూ విమానం దిగిన రావణాసురుడు వేదవతిపై ప్రశ్నల వర్షం కురిపించాడు. "నేను ఒంటరి కన్యను, నాతండ్రి కులద్విజుడు. నా పితృదేవుని వేదగానంలో జన్మించాను. నాపేరు వేదవతి, తండ్రి నన్ను శ్రీనివాసునికి భార్యను కమ్మని దీవించాడు. అ శ్రీపతిని భర్తగా పొందాలని తపస్సు చేస్తున్నాను" అని వేదవతి సమాధానం ఇచ్చింది. అయితే దయచూపని శ్రీపతి కోసం, శ్రీపతిని భర్తగా పొందడం కోసం నీవు తపస్సు చేయడం వ్యర్థం అవివేకం. నిన్నుగాఢంగా ప్రేమించే ఈ లంకాధిపతిని ఆ శ్రీపతిగా భావించి నీ పతిగా స్వీకరించడం నీకు సర్వదా శ్రేయస్కరం. అదే వివేకవంతమైన నిర్ణయం"అన్నాడు రావణుడు. 'నీవు శ్రీహరిని నిందించడం నేను సహించను. శ్రీపతి లోకాధిపతి. నీవు కేవలం లంకాధిపతివి. శ్రీనివాసుని పవిత్రమైన నామాన్ని స్మరించడానికి నీవు అనర్హుడవు. నీవు వచ్చిన దారినే వెళ్ళడం నీవు చేయవలసిన పని. తక్షణం నీవు వెళ్లిపోవలసిందిగా హెచ్చరిస్తున్నాను" అంటూ వేదవతి రావణుని మందలించింది. అవమానభారంతో ప్రతీకారం తీర్చుకోవడానికై రావణుడు తన ఎడమ చేతితో వేదవతి శిరోజాలను పట్టుకున్నాడు. ఆమె శ్రీనివాసుని స్మరించుకుని తనకుడిచేతిని కత్తిగా మార్చుకొని రావణుడు బిగపట్టిన తన తలవెంట్రుకలను ఖండించింది. వేదవతిని పరాభవించే ప్రయత్నంలో రావణుడే పరాభవితుడయ్యాడు. తాను పొందిన అవమానాన్ని భరించలేక రావణుడు కోపోద్రిక్తుడయ్యాడు ఆవేశంతో వేదవతిని బలవంతం చేయడానికి పూనుకున్నాడు. ఆ ప్రయత్నంలో ముందుకు వెళ్ళగా ఆమె తన తపోమహిమతో రావణుని నిరోధించడానికి అగ్నిని జ్వలింపజేసింది. అతడు వజ్రాయుధంతో మంటలను చల్లారుస్తూ ఆమెను సమీపించాడు. "నేను అబలను. నాకు తపోభంగం కలిగించావు. నన్ను మానభంగానికి గురిచేయాలని చూస్తున్నావు. నావంటి అబల మూలంగానే మహా బలవంతుడివైన నీకు ప్రాణభంగం కలుగుతుంది. ఇది తథ్యం" అని వేదవతి కఠినంగా రావణుని శపించి తాను సృష్టించుకున్న అగ్నిలో ప్రవేశించి అదృశ్యమైపోయింది.

## ఒప్పో నుంచి ఎ3ప్రో



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో కొత్తగా తన ఒప్పో ఏ3 ప్రోను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. గత ఏప్రిల్‌లో చైనాలో ఈ ఫోన్‌ను ఆవిష్కరించింది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్, 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంది. 8జిబి ర్యామ్ విత్ 128జిబి స్టోరేజీ వేరియంట్ ధరను రూ.17,999గా, 8జిబి ర్యామ్, 256 జిబి స్టోరేజీ వేరియంట్ ధరను రూ.19,999గా నిర్ణయించింది. ఒప్పో ఏ3 ప్రో ఫోన్ 50 ఎంపి ప్రైమరీ సెన్సర్ కెమెరాతో పాటు డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ సహా సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరాను అమర్చింది.

## బైజూస్‌లో రూ.4వేల కోట్లు హుష్



కరోనాకు ముందు ఓ వెలుగు వెలిగిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌లో రూ.4వేల కోట్ల పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ ఎన్‌వి నిండా మునిగినట్లు ప్రకటించింది. 2018లోని తమ పెట్టుబడులు ఇప్పుడు సున్నా విలువకు పడిపోయినట్లు తెలిపింది. తాము బైజూస్‌లో పెట్టిన పెట్టుబడుల వాటాను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. బైజూస్ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్ అంచనాలకు సంబంధించి తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆ సంస్థ విలువను తాము సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ తెలిపింది. తద్వారా తమకు 493 మిలియన్ డాలర్లు (రూ.4వేల కోట్లు) మేర నష్టం వాటిల్లినట్లు ఆ కంపెనీ పేర్కొంది.



## పాషన్ ఫ్రూట్ గురించి విన్నారా? దీంతో కలిగే లాభాలేంటంటే..!

పండ్లలో చాలా రకాలు ఉన్నాయి. అయితే తెలుగు ప్రజలకు కాస్త పరిచయం తక్కువ ఉన్న పండ్లలో పాషన్ ఫ్రూట్ కూడా ఒకటి. ఈ పాషన్ ఫ్రూట్ లోపల గుజ్జు, గింజలతో కూడి ఉంటుంది. దీని తొక్క మాత్రం గట్టిగా చూడటానికి ఏ మారేడు కాయో అనిపించేలా ఉంటుంది. ఊదా రంగులోనూ, పసుపు రంగులోనూ పాషన్ ఫ్రూట్ లు చాలా ఎక్కువగా కనిపిస్తాయి. దీని గుజ్జుతో వివిధ రకాల పానీయాలు తయారుచేస్తారు. రోగనిరోధక శక్తికి పాషన్ ఫ్రూట్ పెట్టింది పేరు. ఈ పండులో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ఇందులో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఆరోగ్యకరమైన చర్మానికి సహాకరిస్తుంది. పాషన్ ఫ్రూట్ లో పెద్ద మొత్తంలో విటమిన్ ఎ, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం కూడా ఉంటాయి. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి.

ఆరోగ్య ప్రయోజనాలు : దీర్ఘకాలిక వ్యాధులను నివారిస్తుంది.. విటమిన్ సి, పాలీఫెనాల్స్‌తో సహా పాషన్ ఫ్రూట్‌లోని అధిక యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడటానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి.

తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ : పాషన్ ఫ్రూట్ లో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పెంచవు, మధుమేహం ఉన్నవారికి మంచివి. పాషన్ ఫ్రూట్‌లో ఆస్కార్బిక్ యాసిడ్ ఉంటుంది. రక్తంలో చక్కెరను నియంత్రణలో ఉంచడంలో ఆస్కార్బిక్ ఆమ్లం సహాయపడుతుంది.

**బరువు నిర్వహణ :** ఈ పండులో ఉండే పీచు పదార్థం ఎక్కువసేపు కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది. తద్వారా పదే పదే తినడాన్ని నియంత్రిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. ప్రేగు కదలికలను చురుగ్గా ఉంచుతుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది :**విటమిన్ సి, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, ఇన్ఫెక్షన్‌తో పోరాడడంలో, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ప్యాషన్ ఫ్రూట్ పీల్స్ వల్ల రోగనిరోధక వ్యవస్థ ప్రభావవంతంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యం :** ప్యాషన్ ఫ్రూట్‌లోని పొటాషియం కంటెంట్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులోని ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ధమనులలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడతాయి.

**గట్ మైక్రోబయోమ్ :** ఒక చిన్న పాషన్ ఫ్రూట్ లో ఉండే ఫైబర్ ప్రీబయోటిక్‌గా పనిచేస్తుంది. ఇది మైక్రోబయోమ్‌ను మంచి బ్యాక్టీరియాతో ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది.

# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...








# పెంటగట్ల మణికుమార్‌కి అంబేద్కర్ జాతీయ అవార్డు

**రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతున్న ఆదర్శ సేవకుడు**
**పలు సేవా కార్యక్రమాల్లో ముందంజ**
**ఇప్పటికే 400కి పైగా అవార్డులు**
**అభినందనలతో ముంచెత్తుతున్న ప్రముఖులు, సేవా సంస్థల ప్రతినిధులు**




రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:
పెంటగట్ల మణికుమార్‌కి వచ్చిన అవార్డుల జాబితాలో డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు చేరింది. ఇప్పటిదాకా 400కి పైగా జాతీయ అంతర్జాతీయ అవార్డులు అందుకున్న పెంటగట్ల మణికుమార్ ఆదివారం విజయవాడలో అక్కినేని నాగేశ్వర రావు కళ్యాణ వేదికలో మదర్ సర్వీస్ సొసైటి ఫౌండర్ మల్లాది ప్రసాద్ రావు నిర్వహించిన జాతీయ అవార్డులలో భాగంగా పెంటగట్ల మణికుమార్ ను ఎంపిక చేసి డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు అందజేశారు. రాజమండ్రిలోనే కాక ప్రక్క రాష్ట్రలలో, వివిధ ప్రాంతాల్లో ఎవరికైనా రక్తం అవసరం ఉందంటే మెదటి గుర్తు వచ్చే వ్యక్తి అతడే తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, కోండగుంటూరు గ్రామనికి చెందిన వ్యక్తి పెంటగట్ల మణికుమార్. ఎవరికైనా రక్తం అవసరమని తెలిసిన వెంటనే అక్కడ మణికుమార్ ప్రత్యక్షమై క్షణాల్లో రక్తం అందించి ప్రాణ దాత అవుతున్నాడు. ఇప్పటి వరకు 36 సార్లు రక్తదానం చేయడమే కాకుండా దాదాపు 5300 మందికి పైగా రక్తం అందించిన ఘనత దక్కించుకున్నాడు. తద్వారా రాజమండ్రి ప్రాంత ప్రజలందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈయన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా , తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మణి కుమార్ బ్లడ్ సేవలు కోనుసాగుతున్నయి.

ఈ సందర్భంగా పెంటగట్ల మణికుమార్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం – రక్తదానం చేయండి ప్రాణాన్ని కాపాడండి అని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఒకరి జీవితం కాపాడగలమన్నారు. యువత స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయలని అన్నారు. తలసేమియ పిల్లలకు ,ఎయిడ్స్,వ్యాధిగ్రస్తులకు, డయాలిసిస్ రోగులకు ,గర్భిణీ స్త్రీలకు,క్యాన్సర్ వ్యాధి పెషెంట్లకు , రోడ్డు ప్రమాదలు శస్త్ర చికిత్సలు జరిగే సమయల్లో రక్తం ఏంతో అవసరం ఉంటుందన్నారు. మనం రక్తదానం చేయడం ద్వారా ఒక కుటుంబాన్ని నిలబెట్టడం సాధ్యం అవుతుందనే సామాజిక స్పృహ ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. అంతేగాక అయ్యంకి సురేష్ బాబు సూచన మేరకు 2014 నుండి ప్రతి సంవత్సరం వృద్ధులకు , వితంతువులకు, వికలాంగులకు దుప్పట్లు ,చీరలు పంపిణీ, అన్నదాన కార్యక్రమలు నిర్వహించడం, నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేయడం, పేదలకు హాస్పిటల్ బిల్లులు నిమిత్తం ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కరోనా సమయంలో మాస్క్ లు,శానిటిజర్లు, గ్లౌజులు, మజ్జిగ , నిత్యావసర వస్తువులు, భోజనలు పంపిణీ చేశామన్నారు. 50 పైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, మెక్కలు నాటడం,గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేయడం, ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేయడం వలన 400 పైగా జాతీయ,అంతర్జాతీయ అవార్డులు వచ్చాయని మణికుమార్ వివరిస్తూ,ఇలా అవార్డులు వచ్చినపుడు చాలా చాలా సంతోషంగా ఉంటుందన్నారు. అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. ఈసందర్భంగ మణికుమార్ ను పలువురు సమాజ సేవకులు, స్వఛంధ సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులు అభినందించారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటి సభ్యులు,ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరి ఆర్గనైజేషన్ ఫౌండర్ అయ్యంకి సురేష్ బాబు,మనం ఫౌండేషన్ చక్రవర్తి , హెల్ప్ ఫౌండేషన్ కంచర్ల బుజ్జిబాబు , దాసు ,సరళ , మూవి ఆర్టిస్టు ,హర్ష డెవలపర్ సందీప్,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ,ఒరిస్సా,కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో సేవ చేస్తున్న అనేక స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మవారి కృప
# అందరిపై ప్రసరించాలి

**జాతర మహోత్సవంలో "రౌతు"ఆకాంక్ష**



రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :
సృష్టికి మూలమైన శ్యామలాంబ అమ్మవారి కృప అందరిపై ప్రసరించాలని మాజీ ఎమ్మెల్యే,రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక మఠం వీధి లో శ్రీ శ్యామలాఅంబ అమ్మవారి 73 వ జాతర ప్రారంభోత్సవ మహోత్సవంలో పాల్గొన్న రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మ వారి జాతర మహోత్సవం నిర్వహిస్తూ ఆధ్యాత్మిక తను అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాకచర్ల కృష్ణ ,జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు పిల్లా వెంకన్న, కమిటీ సభ్యులు వున్నారు.

## అక్రమ మద్యం
# అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



జగ్గంపేట, విశ్వంవాయిస్ న్యూస్ :
కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామంలోని ఒక పాన్ షాప్ లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు జగ్గంపేట ఎస్సై టి. రఘునాధరావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో దాడులు నిర్వహించారు.ఈ యొక్క దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాపు యజమాని రామవరం గ్రామానికి చెందిన మాదాసు సత్యనారాయణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 11 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రఘునాధ రావు తెలిపారు.అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని, కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం
# కలిగితే చర్యలు కఠినం

**మహిళలతో అసభ్యకర ప్రవర్తన ఉంటే ఉపేక్షించేది లేదు**
**రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పీతల దొరరాజు**



మండపేట రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :
గత సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన పోలీస్ అధికారుల బదలీల నేపథ్యంలో ఇటీవల మండపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పీతల దొరరాజు భాద్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో ఆయన క్యాంపు కార్యాలయం నందు పాత్రికేయులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఏ ఒక్కరు ఐనా శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలతో అసభ్యకరమైన ధోరణి ఉంటే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్, బహిరంగ మద్యపానం, గంజాయి వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సేవలలో నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా కాల్ చేయవలసిన నంబర్ " 9440796537 " గా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ డి. సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవకు ప్రతిరూపం
# మదర్ థెరీసా జీవితం

**వివేకానంద విద్యా సంస్థల ప్రిన్సిపాల్ అండ్ కరెస్పాండెంట్ ఒమ్మి రఘురామ్**




జగ్గంపేట, విశ్వంవాయిస్ న్యూస్ :
ఈ భూమి మీద జీవించిన అరుదైన,మహోన్నతమైన మానవురాని వ్యక్తి మదర్ థెరీసా అని,తన జీవిత కాలమంతా ప్రజా సేవకే అంకితమైన వ్యక్తి అని ఆ మహాతల్లి గురించి ఎంత చెప్పినా తక్కువే అని వివేకానంద విద్యా సంస్థల ప్రిన్సిపాల్ అండ్ కరెస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ అన్నారు .ఆగస్టు 26 మదర్ థెరీసా పుట్టిన రోజు పురస్కరించుకొని మంగళవారం జగ్గంపేట వివేకానంద విద్యా సంస్థల్లో వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1910లో పుట్టిన ఆమె 1977 సెప్టెంబర్ 5న ఈ లోకాన్ని వీడారని ఒమ్మి రఘురామ్ అన్నారు. తన 66 ఏళ్ల జీవిత కాలంలో ఎన్నో మైలురాళ్లు ఉన్నాయని.లెక్కలేనన్ని అవార్డులు, పురస్కారాలు మదర్ థెరీసా అందుకున్నారన్నారు. ఆమె పూర్తి పేరు ఆగ్నీస్ గోక్షా బొజాక్షువా అని,మదర్ థెరీసా స్వస్థలం ఆల్బేనియా దేశం అని, రోమన్ కాథలిక్ సన్యాసిని అని, భారతదేశ పౌరసత్వం పొంది మిషనరీస్ ఆఫ్ ఛారిటీని కోల్ కతాలో ఏర్పాటు చేసిందని.తన సేవల ద్వారా గుర్తింపు పొందిందని. ఈ చారిటీని 1950లో స్థాపించిందని అన్నారు.45 సంవత్సరాల పాటు మిషనరీస్ ఆఫ్ ఛారిటీని భారత దేశంలో, ప్రపంచంలోని ఇతర దేశాలలో వ్యాపించేలా మార్గదర్శకత్వం వహిస్తూ, పేదలకు, రోగ గ్రస్తులకూ, అనాథలకూ, మరణశయ్యపై ఉన్నవారికీ పరి చర్యలు చేసి సేవకు ప్రతిరూపంగా మదర్ థెరీసా నిలిచారు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాకు ప్రభుత్వాలు
# మరింత ప్రోత్సాహం అందచేయాలి

**రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి.. కృష్ణ సాయి కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు మరింత ప్రోత్సాహం అందచేయాలని, ప్రజలు అందరికి యోగాపై ఆసక్తి కల్పించి వారి ఆర్యోగాన్ని కాపాడుకునేందుకు సహకరించాలని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి కోరారు. యోగాకు ప్రధాని నరేంద్ర మోదీ అమితమైన ప్రచారం కల్పిస్తున్నారని, ఆయన కృషితో ఒలింపిక్స్‌లో యోగాను కూడా ఒక క్రీడగా ప్రవేశపెట్టడం తధ్యమన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఈస్ట్ గోదావరి ఆధ్వర్యంలో స్థానిక ఎ.పి. పేపర్‌మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణ సాయి కళ్యాణ మండపంలో మంగళవారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి సుమారు 30 మంది పాల్గొనగా 20 మంది పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతీ ప్రధానోత్సవ కార్యక్రమానికి డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు నేషనల్ జడ్జి, కోచ్ గరిమెళ్ల రామకృష్ణ పరిశీలకుడిగా హాజరుకాగా జిల్లా ప్రధాన కార్యదర్శి, నేషనల్ జడ్జి కర్రి శ్రీధర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వి. సుబ్బారావు యోగాసన పోటీలను నిర్వహించారు. డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ యోగాలో ఒలింపిక్స్ వరకు వెళ్లి ఏ పతకం సాధిం చినా దేశానికి గర్వకారణమేనన్నారు. శ్రీధర్ రెడ్డి ఇటీవలనే యోగాలో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదయ్యారని, యోగాకు మరింత ప్రాచుర్యం కల్పించడా నికి ఆయన కృషిచేస్తున్నారన్నారు. జిల్లా యోగాసనా పోటీలలో విజేతలుగా సబ్ జూనియర్స్ లో ట్రెడిషనల్ విభాగంలో కే. కార్తీక్ (బాలుర), వి.సాత్విక (బాలికలు), ఆర్టిస్టిక్ సోలో విభాగంలో కే. కార్తీక్ (బాలుర), వి. సాత్విక (బాలికలు), ఆర్టిస్టిక్ ఫెయిర్ విభాగంలో ఎన్. నవ్య, ఎం. భవిత, జూనియర్స్ ఆర్టిస్టిక్ సోలో విభాగంలో ఎస్.శరణ్య ట్రెడిషనల్ విభాగంలో బి.సౌజన్య, సీనియర్స్ ట్రెడిషనల్ విభాగంలో టి.సూర్య, మాస్టర్స్ ట్రెడిషనల్ విభాగంలో ఎస్.శ్యామ్ విచేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలిచిన యోగ సన క్రీడాకారులకు సర్టిఫికెట్ల తోపాటు మెడల్స్ కూడా ప్రధానం చేశారు.జడ్జిలుగా వ్యవహరించిన అనంతలక్ష్మి, జి.శ్రీనివాస్, బి.అరుణ కుమార్, కె.హేమ నిర్మలారెడ్డి, శ్యామ్ సుందర్‌లకు కూడా సర్టిఫికెట్లు ప్రదానం చేసారు.ఈ కార్యక్రమంలో యోగా గురువులు, యోగా శిక్షకులు, యోగ విద్యార్థులు పాల్గొన్నారు

# కన్నయ్య వేషంలో మురిపించిన చిన్నారి నివాన్ష్ శ్రీ కార్తికేయ



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్రీకృష్ణాష్టమి అంటే అందరికీ సందడే. ఉట్టికొట్టడం,బాలకృష్ణుని వేషధారణ పోటీలు నిర్వహించడం,కోలాట భజనలు, ఊరేగింపులు, వంటివన్నీ షరా మామూలే. అయితే కొన్ని ఇళ్లలో ఆ బాలకృష్ణుడే మువ్వల సవ్వడి చేసుకుంటూ తమ ఇంటికి వస్తున్నాడని భావించి, చిన్ని చిన్ని పాదాలతో కూడిన ముగ్గులు వేయడం, రంగులు అద్దడం చేస్తుంటారు. మరికొందరైతే తమ ఇంట్లోని పసిపాపలను బాలకృష్ణుడుగా అలంకరించి మురిసిపోతుంటారు. అదేరీతిలో రాజమండ్రిలోని వంశీ,చాందినీ అనే యువదంపతుల తనయుడు చి. నివాన్ష్ శ్రీ కార్తికేయకు (కన్నయ్య) వేషధారణ చేసి ఆ దంపతులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. చుట్టుపక్కల వారిని ఆ చిన్నారి కన్నయ్య మురిపించాడు.తెల్లని వస్త్రంపై ముద్దులొలికే ఈ చిన్నారిని శయనింపజేసి ఛాయా చిత్రాల్లో, వీడియోలో బంధించారు.అన్నట్టు ఈ బుడతడి వయస్సు ఎంతంటే, తాజాగా ఈ రోజే ఐదవ నెలలోకి చొరబడ్డ ఈ బుడతడిని ఇంట్లో ముద్దుగా కన్నయ్య అని పిలుస్తారు. ఇప్పుడు నిజంగానే కన్నయ్యగా వేషం వేయించడం విశేషం.




# వైన తేయ గోదావరి చెంత వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



**పి. గన్నవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పి. గన్నవరం వైనతేయ నదీ తీరాన పట్టాభిరామ ఆలయం వద్ద గరుడవేగ టీమ్ , రామసేతు భక్త బృందం ఆధ్వర్యంలో కృష్ణా ష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉద యం నుండి స్వామివారినామకరణం, గోమాత పూజ స్వామివారికి అభిషేకం నిర్వహిం చారు. అనంతరం ముఖ్యఅతిథిగా ప్రముఖ అజ్ఞాతక సామాజికవేత్త ప్రవచనకర్త శ్రీమతి అనంతలక్ష్మి ప్రసంగించారు. అనంతరం చిన్ని కృష్ణుని ఎడ్ల బండి పై ఊరేగింపు, కోలాటం, చిన్నపిల్లల వేషధారణ, గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు వంటి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఒరిస్సా నుండి భజనభక్త బృందం బొబ్బిలి నుండి వచ్చిన మహిళలు కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి ఈ గన్నవరం పురవీధుల్లో గరుడ వాహనంపై శ్రీకృష్ణుని. గ్రామోత్సవం నిర్వ హించారు. అనంతరం ఉట్టి ఉత్సవం, గోదా వరి మహా హారతి కార్యక్రమం నిర్వహిం చారు. గన్నవరపు బాబి.కదలి చంద్ర. యర్రంశెట్టి భాస్కర్, యర్రంశెట్టి బాబి, గన్నవరపు అమ్మిరాజు,









గన్నవరపు వాసు, ఎస్కే దొరబాబు, మేడిది పరంధామయ్య, కొక్కిరి సురేష్, వీరబాబు వేడుకల్లో భక్తులు అధిక సంఖ్య లో మహిళలు పాల్గొన్నారు.

## రాజమండ్రిలో 29న
# తెలుగు భాషా దినోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పుగోదావరి జిల్లా శాఖ మరియు రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి,తెలుగు భాషా దినోత్సవం ఈ నెల 29వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు అరసం తూ.గో.జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక గోరక్షణపేటలోని సంఘం కార్యాలయంలో తూ.గో.జిల్లా ధరల నియంత్రణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆనాటి సభకు రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టీ.కే. విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షత వహిస్తారు. విశిష్ట అతిథులుగా కోనసీమ జిల్లా అరసం అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్, అరసం తూ.గో.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్. పృథ్వి,నన్నయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. తరపట్ల సత్యనారాయణ, ఎస్కెవిటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధిపతి డా. పి.వి.బి.సంజీవరావు, అరసం జిల్లా కార్యదర్శి డా.బిహెచ్.వి.రమాదేవి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షులు లోలభట్టు శ్రీనివాసరాజు, తూ.గో.జిల్లా ధరల నియంత్రణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు, తూ.గో.జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావు హాజరవుతారు. కార్యక్రమాన్ని రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ.సత్య సౌందర్య నిర్వహిస్తారు. విభూతి బ్రదర్స్ అభ్యుదయ గేయాలు ఆలపిస్తారు.

## వైభవంగా శ్రీ శ్యామలాంబ అమ్మవారి
# జాతర మహోత్సవం
### అమ్మవారిని దర్శించుకున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామివారి మఠం వీధిలో శ్రీ శ్యామలాంబ అమ్మవారి 73వ జాతర మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది.జాతర మహోత్సవానికి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.శ్రీవెంకటేశ్వర మఠం వీధిలో వెలిసిన వేంచేసిన శ్రీ శ్యామలాంబ అమ్మవారిని శ్రీనివాస్ దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఉత్సవ కమిటీ నాయకులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కు ఆలయ మర్యాదలతో సాంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికి వేద పండితుల ఆచరివచనం ఇప్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ స్థానిక ప్రజలకు అభివాదం చెప్పారు. శ్రీ శ్యామలాంబ అమ్మవారి కృపకు పాత్రులై ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. 73 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా జరుగుతున్న శ్రీ శ్యామలాంబ అమ్మవారి జాతరలో డప్పు వాయిద్యాలు, గరగనత్యాలు, శక్తి వేషాలు, అఘోరాల ప్రదర్శన, కాళికాదేవి, శివుడి వేషధారణ తదితర వంటి జానపద నృత్య రూపకాలు విశేషంగా అలరించాయి. ఉత్సవ కమిటీ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవారి జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్వాగతం తెలిపిన వారిలో ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ పిల్లా వెంకన్న, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వెల్లంకి జయరాం, వైస్ ప్రెసిడెంట్లు కుడిపూడి నాగేశ్వరరావు (నాగు), కంచుపల్లి శ్రీను, రాజాన భద్రరావు, హర్ష, రాజాన శేఖర్, వీరవల్ల శివ, యర్ర క్రాంతి, కోశాధికారి సుబ్రహ్మణ్యం, నాయకులు గొంతుకూరి అప్పారావు, కమిటీ యువకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి
# ఎదురవుతున్న సమస్యలను గుర్తించాలి
### జిల్లా కలెక్టర్ అర్ మహేష్ కుమార్




**అమలాపురం టౌన్ విశ్వంవాయిస్ న్యూస్ :** జిల్లారైల్వే లైన్ ప్రాజెక్ట్ అలైన్మెంట్ ఉన్న గ్రామాలలో ప్రత్యేక బృందాలను నియమించి రైల్వే లైన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్లో కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్ అలైన్మెంట్ మీద జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ప్రాజెక్టులో భాగంగా గౌతమి వైనతేయ వశిష్ఠ నదులపై వంతెన నిర్మాణాలపై ముందుకెళ్లాలని రైల్వే అధికారులకు సూచించారు. కోటిపల్లి – మాగం వరకు రైల్వే లైన్ అలైన్మెంట్లో ఉన్న భూమిని డిసెంబర్ చివరి నాటికి రైల్వే అధికారులకు అప్పగిస్తామని, రైల్వే అధికారులు టెండర్ పనులు మొదలు పెట్టాలన్నారు. అమలాపురం నుంచి రాజోలు వరకు ప్రస్తుత రైల్వే లైన్ అలైన్మెంట్ ఉన్న గ్రామాలలో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, గ్రామ సర్వేయర్, వ్యవసాయ సహాయకులు, ఇతర సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో గ్రామానికో బృందాన్ని నియమించి ఆయా గ్రామాలలో రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి 14 రోజుల్లో నివేదిక సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా తమ శాఖల వారీగా ఉన్న ఇబ్బందులను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. అందరి ఆమోదయోగ్యంతో సమస్యలను పరిష్కరిస్తూ రైల్వే లైన్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు గౌతమి నదిపై నిర్మిస్తున్న వంతెన అయినవిల్లి మండలంలో ల్యాండింగ్ పాయింట్ వద్ద భూమి విషయంలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ సీఈవో పి వి వి సత్యనారాయణ, అమలాపురం కొత్తపేట రెవిన్యూ డివిజన్ అధికారులు జి కేశవ వర్ధన్ రెడ్డి, వి సత్యనారాయణ, ఓఎన్జిసి ,గెయిల్, మోర్త్ ప్రతినిధులు, జిల్లా అధికారులు, సంబంధిత మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## సారా బట్టిపై
# పోలీసులు దాడి



**జగ్గంపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామ శివారున నిర్వహిస్తున్న సారా బట్టిపై పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా సారా బట్టి నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎస్సై టి. రఘునాధరావుకు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున ఎస్సై తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఉటను ధ్వంసం చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా అక్రమంగా సారా తయారీకి పాల్పడుతున్న కేసు బోయిన వీర్రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని,కేసు నమోదు చేశామన్నారు. అతని కోర్టుకు హాజరు అజ్రపరుస్తామని తెలియజేశారు.

## ఆదిమూలం వారి
# కృష్ణాష్టమి వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక దేవీచౌక్ పెద్దవీధిలో ఆదిమూలం వారి ఇంట శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆది మూలం రామకృష్ణ, లక్ష్మి దంపతులు సాంప్రదాయ బద్ధంగా ఇంటిని అలంకరించి కృష్ణాష్టమి వేడుకలు జరిపారు. గత 40ఏళ్లుగా ఇదే రీతిలో ఉత్సవాలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. కుటుంబ సభ్యులు గమిని బాబ్జి, పద్మ, దంపతులు, మెట్టమర్రి మల్లేశ్వరరావు, రాజేశ్వరి దంపతులు, కంకటాల సాయిరాం, అనూష, తాయారు, రోహిణి, గ్రంధి సుధ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. సాయంత్రం 12ఉట్లు కట్టి ఉట్టి ఉత్సవం చేసారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ క్యాంపు
# పోస్టర్ ఆవిష్కరణ




**అమలాపురంటౌన్, విశ్వంవాయిస్ న్యూస్**

జనసేన అధినేత, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నల్లా ఇంద్రాణి మెమోరి యల్ సౌజన్యంతో జి . ఎస్.ఎల్.హాస్పిటల్ రాజమండ్రి వారి చే మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు నల్లా శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్లో పలువురు జనసేన నేతలు పోస్టర్ను ఆవిష్కరించారు. గత సంవత్సరం లానే భారీ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్ట్ 31, సెప్టెంబర్ 1వ తేదీలలో, ముస్లిం శాధిఖానా, అమలా పురం టౌన్ బ్యాంక్ ఎదురుగా, నల్లవంతేన రోడ్, అమలా పురం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్ ని ఈమెగా మెడికల్ క్యాంపును నియోజకవర్గ వ్యాప్తంగా అవసరమైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు జనసేన పార్టీ కౌన్సిలర్స్,వీర మహిళలు, అత్యధిక సంఖ్యలలో అమలాపురం నియోజకవర్గ నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

## ఆర్యాపురం శ్రీ రాధాకృష్ణ
# మందిరంలో నందోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్యాపురంశ్రీకృష్ణ చైతన్య మిషన్, ఆశ్రమం, శ్రీ గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీల త్రిదండి స్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహారాజ్, శ్రీల ఆచార్యదేవ శ్రీ త్రిదండి స్వామి భక్తి కమల గోవింద గోస్వామి మహారాజ్ ఆశీస్సులతో ఘనంగా ముగిసాయి. ఈసందర్భంగా మంగళవారం ఉదయం శ్రీ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ పూజలు చేసిన అనంతరం నందోత్సవం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. గోకుల్ టీవీఎస్ అధినేత నారా వివి సత్యనారాయణ, ఎస్బి మోటార్స్ అధినేత ఎం.రంగ ప్రసాద్, పివిఎస్ కృష్ణారావు, నిమ్మలపూడి గోవింద్,తదితరులు హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, పెద్దలు , పెద్దఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేసినందుకు ఆశ్రమం ఇన్చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి కృతజ్ఞతలు తెలిపారు.

# అన్ని సమస్యలు పరిష్కరిస్తాం
### అవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తాం
### శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలి
### 50వ డివిజన్ పర్యటనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డివిజన్లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని రాజమహేంద్ర వరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 50వ డివిజన్లోని భాస్కరనగర్, సుబ్రహ్మణ్య నగర్, చౌడేశ్వరి నగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, డివిజన్ ఇన్చార్జ్ మరుకుర్తి రవి యాదవ్,నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, హరి బెనర్జీ, నగర పాలక సంస్థ అధికారులు తదితరులతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించారు. డివిజన్లో అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారును ఆదేశించారు. అందుకు సంబంధించిన అంచనాలు తయారు చేయాలని సూచించారు. డివిజన్లోని శివారు ప్రాంతంలో రాత్రి సమయాల్లో కొంతమంది ఆకతాయిలు ఇష్టానుశారం ప్రవర్తిస్తున్నారని, మద్యం, గంజాయి సేవిస్తూ ఇబ్బంది పెడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి ఆ ప్రాంతంలో ఎక్కువ గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డివిజన్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, గత పాలకులు కమీషన్లకు ప్రాధాన్యత ఇచ్చారు కానీ, అభివృద్ధి, సమస్యల పరిష్కారాన్ని గాలికి వదిలేశారన్నారు. పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా ఉన్నట్లు తాము నిర్వహించిన పర్యటలో తెలుసుకున్నామని, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని నచివాలయ సిబ్బందిని ఆదేశించామన్నారు. స్థానిక నాయకులు, మహిళలు,యువకులు తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# సైన్స్‌తోనే శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి
### సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టండిప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలి



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ :** సైన్స్‌తోనే నాగరికత మరింత అభివృద్ధి సాధించిందని, శాస్త్ర విజ్ఞానం పురోభివృద్ధి సాధించడంతో సమాజం కొత్త పుంతలు తొక్కిందని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం కమలకుమారి సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఏ మధుసూదన్ రావులు పిలుపునిచ్చారు. మంగళవారం అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గుబ్బల నాగ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా కమల కుమారి మధుసూదన్ రావులు మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలన్నారు ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలని ప్రతి విద్యార్థిలో ఏదో ఒక అంశంలో సృజనాత్మకత దాగి ఉంటుందన్నారు ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ళ శివప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాలలో భారతదేశం ప్రపంచ దేశాల సరసన నిలుచుందన్నారు దానికి భారతీయ శాస్త్రవేత్తలే పునాదివేశారన్నారు అంతరిక్ష శాస్త్ర పితామహుడు విక్రమ్ సారాభాయ్ వేసిన బాటలో ఎందరో శాస్త్రవేత్తలు దేశాన్ని పురోగమన వైపు నడిపించారన్నారు జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అమలాపురం గుబ్బల సూర్య ప్రకాష్ రావు యంగ్ మెన్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు వాకాడ చిన్న, గౌరవాధ్యక్షులు నరాల కృష్ణ కుమార్, సాంస్కృతిక సలహాదారు పిల్లి గోవిందరాజులు తదితరులు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం రాకెట్ వేగంతో దూసుకుపోతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన వక్రత్వం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే జిల్లా స్థాయిలో వారధి పోటీ పరీక్షల్లో భాగంగా వ్యాస రచన వక్రత పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయతలుగా అడబాల నరసింహారావు, వరద శ్రీనివాస్, సుబ్బరాయ శర్మ, కాళీ దుర్గ భవాని, జిఎస్ఆర్ లక్ష్మి, బ్రహ్మానందం, కె ఆర్ఎస్ పద్మా వతి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల ఎస్ రాజేశ్వరి పి శ్రీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# హోమ్ మినిస్టర్‌ని కలసి నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మంగళవారం నాడు దా అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోమ్ మినిస్టర్ వంగలపూడి అనితను కలిసి రాజానగరం నియోజకవర్గంలో గల పలు సమస్యలపై శాసనసభ్యులు బలరామకృష్ణ చర్చించారు. ఈ చర్చల్లో భాగంగా సీతానగరం మండలం మునికూడలి గ్రామ పరిధిలోని అఖండ గోదావరి ఎడమ వరద ఒడ్డుకు 22.400 కి.మీ నుండి 23.400 కి.మీ మధ్య రాతి పిచింగ్ ప్లాట్‌ఫారమ్‌కోసం రూ. 32.59 కోట్ల రూపాయలు మంజూరు చేసి తరచూ కోతకు గురవుతున్న మరియు జారిపోతున్న నది అంచుని పటిష్ట పరచాలని కోరారు. సీతానగరం మండలం జాలిముడి గ్రామ పరిధిలోని బొబ్బిలంకలోని అఖండ గోదావరి ఎడమ వరద ఒడ్డుకు కిమీ 19.000 మరియు కిమీ 21.000 మధ్య రాతి పిచింగ్ ప్లాట్‌ఫారమ్‌ను రూ. 35.17 కోట్లమంజూరు చేసి తరచూ కోతకు గురవుతున్న మరియు జారిపోతున్న నది అంచుని పటిష్ట పరచాలని కోరారు. బొబ్బిల్లంక గ్రామంలో కి.మీ 17.400 మరియు పురుషోత్తపట్నం గ్రామ పరిధిలో కి.మీ 41.735 మధ్య గోదావరి ఒడ్డు మరింత కోతకు గురికాకుండా , ఈ కోత వల్ల వ్యవసాయ భూములను, ప్రజల ఆస్తులు నష్ట పోకుండా నిధుల మంజూరు చే యాలని కోరారు. రైతులకు వ్యవసాయ అవసరాలు మరియు రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు బొబ్బిల్లంక గ్రామంలోని కిమీ 17.400 నుండి పురుషోత్తపట్నం గ్రామ పరిధిలోని కిమీ 41.735 వరకు ఎజిఎల్‌బి బండ్‌పై బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలనీ కోరారు. ఈ పనులను విపత్తు నిర్వహణ శాఖ నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కోరారు.

# తీర్మానాలు లేకుండానే గ్రామ సభలను లేపేసారు !

## గ్రామ సభల్లో ప్రజల విజ్ఞప్తులు స్వీకరించలేదు.. గ్రామ సభల్లో తీర్మానాలు చేయలేదు

## మెజారిటీ పాలకవర్గాలన్నీ వైకాపావే.. అత్యధిక పాలకవర్గాల గైర్హాజరు... ఐదు రోజులైనా తీర్మానాలు పూర్తి కాలేదు

## ఇంకా అందుతూనే ఉన్న ప్రజల ఆర్జీలు...సిబ్బంది అందరూ బదిలీ హడావిడిలోనే...ఇక సాంకేతిక అంచనాలూ ఆలస్యమే

## సెప్టెంబర్ తొలి వారం సిబ్బంది బదిలీలట



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్య స్ఫూర్తి, పారదర్శకతతో పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో 23 తారీఖున ఒకే రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామ సభలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా ప్రతి గ్రామంలో సభలను విజయవంతంగా నిర్వహించారు. వీటిలో కోటి మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. తమ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులకు సంబంధించి ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో కోటి మందికి పైగా ప్రజలు భాగస్వామ్యంతో రూ. 4,500 కోట్లు విలువైన పనులకు ఆమోదం చేసుకోవడం ప్రపంచ స్థాయి రికార్డుగా నిలుస్తుంది. నేటి గ్రామ సభల ద్వారా 87 రకాలైన పనులకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టేందుకు అవకాశం లభించింది. 9 కోట్ల పని దినాలతో, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పన జరుగుతుంది. పంచాయతీ పరిధిలోని వారంతా కూర్చుని గ్రామాభివృద్ధి మీద నిర్ణయాలు తీసుకొనేలా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో, పారదర్శకంగా నిధులు వెచ్చించు కునేలా గ్రామ సభలను నిర్వహించారని గొప్ప ప్రచారం జరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆశించిన రీతిలో గ్రామ సభల్లో తీర్మానాలు మాత్రం జరుగలేదు. ఇదొక్కటే లోటు జరిగింది. చాలా గ్రామాల్లో సభలకు ప్రజలు ఆర్జీలతో రాలేదు. గ్రామ సభల్లో ఆర్జీలను స్వీకరించలేదు. ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనుల కింద కొత్తగా ఫీడర్ కాలువ నిర్మించుట, కొత్త పంట కాలువ నిర్మించుట, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్ నిర్మాణం, వ్యక్తిగత భూముల్లో భూమి అభివృద్ధి పనులు, వ్యక్తిగత భూముల్లో బెంచ్ టెర్రె సింగ్ నిర్మాణం, రైతుల భూముల్లో సరిహద్దు కందకాలు నిర్మించుట, వ్యక్తిగత భూముల్లో వ్యవసాయ బావి నిర్మాణం, పండ్ల తోటలలో రింగు ట్రెంచుల నిర్మాణం, పండ్ల తోటల్లో భూసార సంరక్షణ కందకాలు త్రవ్వడం, రైతుల భూముల్లో గడ్డి పెంపకం, పశువుల షెడ్ల నిర్మాణం, గొర్రెల షెడ్ల నిర్మాణం, కోళ్ళ ఫారాల నిర్మాణం, పట్టు పురుగుల షెడ్లు నిర్మాణం, చిన్న తరహా సాగునీటీ చెరువుల పునరుద్ధీకరణ, ఆ చెరువుల శిఖంలో నల్ల తుమ్మ చెట్ల పెంపకం, ఆ చెరువుల సరిహద్దు చుట్టూ కందకం తవ్వి మొక్కలు పెంచడం, ప్రభుత్వ సంస్థల్లో సరిహద్దు కందకాలు తవ్వడం, వ్యక్తిగత భూముల్లో పండ్ల తోటల పెంపకం, మల్లె, గులాబి పూల తోటల పెంపకం, మల్బరీ తోటల పెంపకం, పండ్ల మొక్కల నర్సరీలు పెంచుట, నర్సిరీల పెంపకం, మునగ నర్సరీల పెంపకం, టేకు, ఇతర అటవీ జాతి మొక్కల నర్సరీల పెంపకం, ప్రభుత్వ సంస్థల్లో మొక్కలు పెంపకం, కొండ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం, కెనాల్ గట్ల పైన మొక్కలు పెంపకం, కమ్యూనిటీ భూముల్లో బ్లాక్ ప్లాంటేషన్, మడ అడవులు పెంపకం, పంట కాలవలో పూడిక తీయుట, ఇరిగేషన్ కాలువలో పూడిక తీయుట, పెద్ద కాలువలు, డ్రైన్లలో పూడిక తీయుట, మైనర్ డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడిక తీయుట, ఫీడర్ కాలువ నందు పూడిక తీయడం, ఫారం పాండ్స్ నిర్మాణం, తారు రోడ్లు, కాంక్రీట్ సిమెంట్ రోడ్లు, కాంక్రీటు సిమెంట్ మురుగు కాల్వలు, పశువులు మేకలు, గొర్రెలు, కోళ్ళ షేడ్స్ పట్టు పురుగుల షేడ్స్ నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, మల్బరీ మొక్కల పెంపకం, రోడ్డుకు ఇరువైపులామొక్కలు, కాలువ గట్లపై, ప్రభుత్వ సంస్థలలో మొక్కల పెంపకం, ఊట కుంటలు నిర్మించడం, వర్షపు నీటి సంరక్షణా పనులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, వ్యక్తిగత సోక్ పిట్స్ నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. అయితే ఈ అంశాలకు సంబంధించి మాత్రమే అర్జీలు పెట్టుకోవాలని ప్రజలకు ముందుస్తుగా సమాచారం ఇవ్వలేదు. పైగా దండోరా కూడా వేయలేదు. ఏయే పనులను చేపట్టవచ్చో అనే అంశంపై గ్రామ సభల్లో గుక్క తిప్పుకోకుండా చదివేసారు. పౌర సమాచార పట్టికలు కూడా అదే గ్రామ సభల్లోనే ప్రత్యక్షం అయ్యాయి. తప్ప కనీసం రెండు మూడు రోజులు ముందుగానైనా వీటిని పంచాయతీలు, సచివాలయాల్లో ప్రజా సమాచారం నిమిత్తం ప్రదర్శించలేదు. దీంతో ప్రజలు ఏయే పనులను ప్రతిపాదించాలనే ఆవశ్యకతపై చర్చలు, ప్రతిపాదనలు, ఆర్జీల స్వీకరణ లేకుండానే, గ్రామ ప్రజల సుముఖంలో తీర్మానాలు జరుగనే లేదు. 2019-2024 వరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఆ పార్టీ ప్రభుత్వం హయాంలోనే పంచాయితీ ఎన్నికలు జరగడం, ఆ పార్టీ నుంచే అత్యధిక పాలకవర్గాలు ఎన్నిక కావడం, ప్రస్తుతం తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలో ఉండటం వలన చాలా వరకు పంచాయతీలు పాఠశాలల నిర్వహణా సంఘాల ఎన్నికలకు, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి దూరంగా ఉన్నారు. ఈ గ్రామ సభల్లో తమకు గౌరవం దక్కదు అనుకున్నారో ఏమో అత్యధిక పంచాయతీల పాలక వర్గాలు ఉపాధి హామీ గ్రామ సభలకు గైర్హాజరు అయ్యారు. వీరు ముఖం చాటేయడంతో పింఛన్ల పంపిణీలో కనిపించినట్టే ఉపాధి గ్రామ సభల్లో కూడా ఎన్.డి.ఎ. పార్టీల శ్రేణుల హవానే ఎక్కువ నడచింది. అక్కడక్కడా నామ మాత్రంగా హాజరైన పాలకవర్గాలు మాత్రం అక్కడికక్కడే గ్రామ సభల్లో తీర్మానాలు చేయించలేక పోయారు. నిజానికి ఒక్క పూట సమయం అంతా సభ నిర్వహణకు, ఎన్.డి.ఏ. నేతల పోటా పోటీ ప్రసంగాలకే సరిపోయింది. ప్రసంగాలతోనే గ్రామ సభలను ముగించేసారు. దీంతో తీర్మానాలు లేకుండానే సభలను లేపేసారు. ఇప్పటికే ఐదు రోజులు పొద్దు పోయినా ఇంకా తీర్మానాలు పూర్తి కాలేదు. ఇంకా ప్రజల ఆర్జీలు పంచాయతీలకు అందుతూనే ఉన్నాయి. ఈ లోగా ఐదేళ్ళ కాలపరిమితి నిండిన, సున్నా కాలం బదిలీల అర్జీలు, దస్త్రాల సమర్పణలో పంచాయతీల సిబ్బంది అందరూ తలమునకలై ఉన్నారు. బదిలీల హడావిడిలోనే వాతావరణం వేడెక్కిపోయి ఉంది. ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసేసుకోవాలట. వచ్చే సెప్టెంబర్ మాసం మొదటి నెలలో బదిలీ(ల)లు పూర్తి కావాలట. ఇక పనుల ప్రతిపాదనల తీర్మానాలు పరిస్థితి ఇలా ఉంటే, ఇక సాంకేతిక అంచనాలూ ఆలస్యమే అవుతాయి. ఇంకా ఆర్జీలు తీసుకోడం, వాటికి సాంకేతిక కొలతలు, నగదు అంచనా ప్రతిపాదనలు, వీటిని అన్నింటినీ అంతర్జాలంలో నమోదు చేసి, ప్రభుత్వానికి నివేదించడం, వాటికి ప్రభుత్వం నుంచి సాంకేతిక ఆమోదం లభించడం వంటి ప్రక్రియలు సజావుగా సకాలంలో పూర్తి కావడానికి ఇంకెంత సమయం తీసుకుంటుందో ప్రభుత్వ అధికారస్వామ్యం, రాజకీయస్వామ్య వ్యవస్థలకే తెలియాలి. తమ పంచాయతీల్లో ఇంకా తీర్మానాలు పూర్తి కాలేదని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం, శంఖవరం, కత్తిపూడి మేజర్ పంచాయతీల కార్యదర్శులు జయంతి వెంకట శివరామకృష్ణ, చెన్నమశెట్టి శ్రీరామచంద్రమూర్తి, వాడ్రేవు చక్రవర్తి, ఎస్.జగ్గంపేట సర్పంచ్ బైరా ఉప్పారావు విడివిడిగా ఒక ప్రశ్నకు సమాధానంగా "విశ్వం వాయిస్" తెలుగు దినపత్రిక విలేకరి జక్కల నాగసత్యనారాయణకు మంగళవారం సాయంత్రం వివరణ ఇచ్చారు. గ్రామ సభలు పూర్తి అయ్యిన వారం, పది రోజుల తర్వాత పంచాయతీలు చేసే తీర్మానాలు ఏ మేరకు ఆ గ్రామ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అద్దం పడతాయో "లోగుట్టు పెరుమాళ్ళకు ఎరుక అన్నట్టు" ఏలిన వారికే ఎరుక.!?.

## కూటమి నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లవరం మండలంలో బిజెపి పార్టీ సభ్యత్వాల నమోదు అల్లవరం మండల అధ్యక్షులు సుంకర సాయి ఆధ్వర్యంలో సాగింది. జిల్లా కో కన్వీనర్ అడపా శ్రీనివాసరావు గ్రామం నందు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జనసేన టిడిపి నాయకులు హాజరైయ్యారు. ఎన్.డి.ఎ కూటమి నాయకులంతా కలిసికట్టుగా ప్రజా సమస్యలపై పనిచేయాలని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు యాళ్ళ దొరబాబు పిలుపు నిచ్చారు. అదేవిధంగా పార్టీ సభ్యత్వాలపై దృష్టి పెట్టి మన జిల్లాలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, అల్లవరం మండల ప్రధాన కార్య దర్శి కట్టా నారాయణమూర్తి, ఆకుల వీరబాబు , కొండేటి ఈశ్వర్ గౌడ్, ఓలేటి పరమేశ్వర రావు, గుడాల పుల్లయ్య శెట్టి, కట్ట జనార్దన్, రామారావు వెంకటేశు విష్ణు దుర్గారావు సతీష్ ప్రకాష్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ఏలేశ్వరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో సచివాలయం 1 నందు పంచాయతీ కార్యదర్శి రామరాజు వర్మ,సబ్ యూనిట్ ఆఫీసర్ ఆనంద్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రస్తుత వర్షాకాల సీజన్ కారణంగా డెంగ్యూ,మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో వివరించారు. దోమల లార్వా ఎలా వృద్ధి చెందుతుందో దానిని ఎలా నివారించాలో ప్రజలకు వివరించారు.దోమల మందు ఎబిట్ ను గ్రామంలో పిచికారి చేపట్టారు.ప్రతి ఒక్కరు తమ పరిసరాలును పరిశు భ్రంగా ఉంచుకుంటూ మురుగు నీటి నిల్వ ప్రదేశాలను అరికట్టాలని సూచించారు.ఎవరికి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎ బి. ప్రసాద్,ఎం ఎల్ హెచ్ పి, సౌజన్య,ఏ ఎన్ ఎం, ప్రశాంతదీప్తి,ఆశా వర్కర్లు సుమలత,కుమారి,భవాని, తదితరులు పాల్గొన్నారు.

## నేమాని భాస్కర రామం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న చిర్ల



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో సంత మార్కెట్ సెంటర్లో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త నేమాని భాస్కర రామం ఆధ్వర్యంలో మాజీ శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని స్వామివారి విగ్రహాలకు పాల అభిషేకం చేసారు. అనంతరం పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చెయ్య టం జరిగింది. గత 5 సంవత్సరాల కాలంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉండగా కొత్తపేట నియోజకవర్గంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మించిన 44 దేవాలయాలలో ఒకటి. ఈ దేవాలయానికి 1 కోటి 10 లక్షల రూపాయలు మంజూరు చెయ్యటం జరిగింది వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కర రామం మరియు దాతల సహాయంతో ఆలయ నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు,గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## జగన్మోహినీ కేశవ, గోపాల స్వామి వారి ఆలయంలో కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**కొత్తపేట ఆత్రేయపురం విశ్వంవాయిస్ న్యూస్ :** ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహినీ కేశవ, గోపాల స్వామి వారి ఆలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్రీ క్రోధి నామ సంవత్సర శ్రావణ బహుళ అష్టమి నాడు అత్యంత వైభవంగా నిర్వహించడమైనది. ఉదయం 8.00 గంటల నుండి శ్రీ స్వామి వారికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన అనంతరం గోపూజ నిర్వహించి సాయంత్రం 8:00 గంటలకు ఉట్టి మహొత్సవం, ప్రసాద వితరణ అనంతరం గ్రామసేవ నిర్వహించరు భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారి పూజ తిలకించి, తీర్థ ప్రసాదములు స్వీకరించియున్నారు అని కార్యనిర్వహణాధికారి తెలియజేశారు ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 73 మంది విద్యార్థులకు అస్వస్థత





**ఏలేశ్వరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం నగర పంచాయతీ ఏలేశ్వరంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో సుమారు 73 మంది విద్యార్థులు విరోచనాలు, వాంతులతో ఏలేశ్వరం ప్రభుత్వాసు పత్రిలో చేరారు. ఈ మేరకు మంగళ వారం తెల్లవారుజామున ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో ప్రిన్సిపల్ చంద్ర శారద ఆధ్వ ర్యంలో సిబ్బంది ఏలేశ్వరం ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు.మరి కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ఎప్పటికప్పుడు విద్యార్థినులను ఆసుపత్రిలో చేర్పించగా, సూపరిండెంట్ డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో వైద్య బృందం సేవలందిస్తు న్నారు. మంగళవారం మధ్యా హ్నానికి 73 మంది విద్యార్థులు వైద్యం పొందుతు న్నారు. అస్వస్థకు గురైన విద్యా ర్థులను జిల్లా కలెక్టర్ షాన్మోహన్,ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విద్యార్థినిలని పరామర్శించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠ శాల ప్రాంగణాన్ని కలెక్టర్ షనషన్మో హన్, ఎమ్మెల్యే సత్యప్రభ పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ షాన్మోహన్ మాట్లాడుతూ సంఘటనపై పూర్తి విచారణ జరిపిస్తామ న్నారు. ఇప్పటికే ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ వివ రాలు ఆరా తీసారని తెలి పారు. ఫుడ్ పాయిజన్ అని ఆలోచిస్తున్నారని, సమగ్ర విచారణ చేపడతామని ఈ సందర్భంగా మీడియాతో తెలిపారు. శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆమె వెంట జనసేన ప్రత్తిపాడు ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు. ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి. కౌన్సిలర్ అలమండ చలమయ్య. బొదిరెడ్డి గోపి. మూది నారాయణస్వామి, కోరాడ కృష్ణ. పతివాడ రామకృష్ణ, హాస్పటల్ ప్రధాన వైద్యురాలు జి శైలజ తన వైద్య బృందంతో విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆమె తెలిపారు.



## రెవెన్యూ శాఖ మంత్రితో భేటీ అయిన ఎమ్మెల్యే బత్తుల

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** రాజానగరం నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నమాట నిలబెట్టుకునే దిశగా ది.27-08-2024 మంగళవారం నాడు అమరావతి సచివాలయంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు శ్ అనగాని సత్య ప్రసాద్ ని గౌరవపూర్వకంగా కలిసి, రాజానగరం నియోజకవర్గంలో గల పలు సమస్యల గురించి చర్చించారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ కోసం 92 మంది రైతులకు నష్టపరిహారం క్లియరెన్స్ కొరకు, 22 (ఎ) (1) (సి) రిజిస్ట్రేషన్ చట్టం నుండి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం కోరుకొండ భూముల నిషేధ తొలగింపు కొరకు చర్చించి సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసారు.

### రైతు సంఘం పోరాటాల ఫలితంగా తుంగభద్ర

# నదిపై బ్రిడ్జి కం బ్యారేజ్



కౌతాళం : తుంగభద్ర నదిపై సమాంతర వరద కాలువ, లేక బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా నేడు కర్ణాటక ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లా కౌతాలం మండలం అన్ని రంగాలలో వెనకబడిన ప్రాంతం. ఈ మండలం పై ఏ రాజకీయ నాయకులు ప్రత్యేకమైన శ్రద్ధ, ఇప్పటివరకు ఇరిగేషన్ పై దృష్టి సారించలేదు. ఈ ప్రాంతంలో వరద కాలువ నిర్మించాలి లేదా బ్రిడ్జికం బ్యారేజ్ నిర్మిస్తే సస్యశ్యామలమైతుందని స్థానికంగా ఎమ్మార్వోలకు, నాయకులకు,జిల్లా స్థాయిలో అధికారులకు, రాష్ట్రస్థాయిలో ఇరిగేషన్ మినిస్టర్ కు, ముఖ్యమంత్రులకు ఎన్నిసార్లు విన్నవించిన ఏ ప్రభుత్వం కూడా స్పందించలేదు. తుంగభద్ర నదిలో వరద జలాలు వృధా అవుతున్నా ఎవరు పట్టించుకోలేదు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి రైతులను ఆదుకోవాలని ఏ పార్టీ కూడా ముందుకు రాలేదు. కేవలం రైతు సంఘం మాత్రమే మేలగనూరు నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు వందలాది మంది రైతులతో పాదయాత్ర నిర్వహించి ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయింది. ప్రస్తుతం కర్ణాటక ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని స్పందించి బ్రిడ్జికం బ్యారేజ్ కి మంజూరు చేసినందుకు రైతు సంఘం తరపున ఆ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని ఆయన అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కూడా కర్ణాటక ప్రభుత్వం మాదిరిగా వెంటనే స్పందించి మన వైపు కూడా కాలువల నిర్మించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె. మల్లయ్య డిమాండ్ చేశారు.

### పోలీసు శాఖలో

# బదిలీల బెంగ..!



**ఏలూరు ప్రతినిధి, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలీస్‌శాఖలో సిఐ, ఎస్ఐల బదిలీలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో ఇటీవల కాలంలో పెద్దఎత్తున సిఐ, ఎస్ఐల బదిలీలు జరిగాయి. బదిలీలకు సంబంధించి మరో జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. చాలామంది అధికారులు ఎంఎల్ఎల సిఫార్సు లేఖలు తీసుకుని తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసినా చుక్కెదురైనట్లు తెలుస్తోంది. బదిలీల ప్రక్రియ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రమేయంతో కాకుండా అమరావతి నుంచి వచ్చే ఆదేశాలతో జరుగుతుందని చెబుతున్నారు. జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారు చేసి అమరావతికి పంపిన తర్వాత అక్కడ నుంచి వచ్చే అదేశాలకు అనుగుణంగా సిఐ, ఎస్ఐలను బదిలీ చేస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల కోసం అమరావతిలో ప్రత్యేకంగా ఒక టీమ్ పని చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులను అనుకూలంగా వ్యవహరించిన, ఏదైనా కారణంతో అప్పట్లో టిడిపి నాయకులపై కేసు నమోదు చేసిన అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా నిలుపుదల చేస్తున్నారు. కొంతమందిని పక్కన పెడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో ఈ విధంగా పలువురి ఎస్ఐలకు పోస్టింగులు ఇవ్వకుండా పక్కన పెట్టిన పరిస్థితి ఉందని తెలుస్తోంది. పోస్టింగ్ ఇవ్వకుండా ఆపిన అధికారుల గురించి ఎంఎల్ఎలు నేరుగా పైస్థాయిలో మాట్లాడినా పట్టించుకోవడం లేదని సమాచారం. దీంతో ఎంఎల్ఎలు సైతం ఏమి చేయలేక చేతులెత్తేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఎంఎల్ఎలు సిఫార్సులు లేఖలు ఇచ్చినప్పటికీ అధికారులను సైతం పక్కన పెట్టడం పోలీస్‌శాఖలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కిందిస్థాయి అధికారులు పని చేస్తారు. కొంతమంది ఎస్ఐ, సిఐలపై కక్షగట్టి పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం పోలీస్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. గత వైసిపి ప్రభుత్వం ఇదేవిధంగా చేసిందని కొత్త ప్రభుత్వం వచ్చాక ఇటువంటివి కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తప్పు చేయని కొంతమంది అధికారులను కూడా వైసిపి అనుకూల జాబితాలో చేర్చి పోస్టింగ్ ఇవ్వడం లేదనే అభిప్రాయం పోలీస్‌శాఖలో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి వదిలి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. పోలీస్ శాఖాధికారుల బదిలీల్లోనూ పెద్దఎత్తున రూ.లక్షల్లో మామూళ్లు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.పోలీస్ సిబ్బంది బదిలీలపై స్పష్టత ఏది..? పోలీస్‌శాఖలో బదిలీలపై సర్వత్రా చర్చ సాగుతోంది. 15 శాఖల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పోలీస్ శాఖలోని సిబ్బంది బదిలీలకు సంబంధించి మాత్రం ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని, అనారోగ్య సమస్యలు, కుటుంబంలోని ఇబ్బందుల నేపథ్యంలో ఎంతోమంది పోలీస్ సిబ్బంది రిక్వెస్ట్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. పోలీస్‌శాఖలో సిబ్బందికి సంబంధించి బదిలీ ఆదేశాలు ఎందుకు ఇవ్వలేదనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మంది వరకూ పోలీస్ సిబ్బంది ఉన్నారు. దాదాపు 60 వరకూ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లోనూ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బంది నలుగురైదుగురు ఉన్న పరిస్థితి. అంతేకాకుండా జీరో సర్వీస్ బదిలీల కోసం ఎదురుచూస్తున్న సిబ్బంది చాలామంది ఉన్నారు. పోలీస్ శాఖలోని సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. పోలీస్ సిబ్బంది బదిలీలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చి ప్రక్రియ చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

### తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఎక్కువ లాభాలు : కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు





**కొత్తపేట ఆత్రేయపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఎక్కువ లాభాలు అందించే ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యా నందరావు రైతులకు పిలుపునిచ్చారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామంలో మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కపిలేశ్వర పురానికి చెందిన సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జి ఎమ్ పి. వీరభద్రరావు,అధికార ప్రతినిధులు,ఉద్యాన శాఖ అధికారులు రైతులకు ఆయిల్ ఫాం సాగు ఉపయోగాలు మార్కెటింగ్ తదితర అవకాశాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల వరి, అరటి తదితర పంటలు తరచూ పంట నష్టానికి లోనై కర్షకులు అనేక కష్టనష్టా లను ఎదుర్కొంటున్నారని, ఇటువంటి సందర్భంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి సంద ర్భంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగు మంచి అవకాశంగా కనిపిస్తుందన్నారు. నూనె గింజల ఉత్పత్తికి దేశంలో అధిక డిమాండ్ ఉండడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయ న్నారు. 30,35 సంవత్సరాల పాటు రైతులకు స్థిరమైన ఆదాయం అందించే ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టడం మంచిదన్నారు. దేశ ప్రజల అవసరాలకు రెండున్నర లక్షల టన్నుల ఆయిల్స్ ఉత్పత్తి జరగాల్సి ఉండగా మనదేశంలో 40 శాతం మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నామని మిగతాదంతా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కపిలేశ్వరపురం సర్వే సాయి ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆయిల్ ఫామ్ సాగు అంశంలో రైతులను ప్రోత్సహించడానికి ముందుకు రావడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే అన్నారు. ప్లాంటేషన్, మార్కెటింగ్ తదితర అంశాల్లో వారి సహకారం రైతు లకు పూర్తిగా లభిస్తుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఉద్యాన శాఖ సైతం డ్రిప్ ఇరిగేషన్ తదితర పథకాలకు సబ్సిడీ అందించడంతో పాటు, ఎన్ ఆర్ జి ఎస్, ఉద్యాన శాఖ అనుసంధానంగా ఉన్న పథకాలను సైతం రైతులు వినియోగించుకునే అవకాశం ఉంద న్నారు. ఈ కార్యక్రమం లో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ముత్తాబత్తుల రాజు,కరుటూరి నరసింహా రావు, ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ పెత్తనం చేయడంలో సర్పంచ్ విఫలం

### పెండింగ్ లో ఉన్న కొత్త భవనాలకి పన్నులు వసూళ్లు చేయండి బీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లు విష్ణు మూర్తి



**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచ్ పెత్తనం చేయడం లో విఫలం చెందారని తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లు విష్ణుమూర్తి ఆరోపించారు.మంగళవారం ఆయన స్వగృహం వద్ద విలేకర్ ల సమావేశం ఏర్పాటు చేసి సోమవారం పత్రికలో సర్పంచ్ మంగయ్యమ్మ చేసిన ఆరోపణల కి స్పందించిన విష్ణు మూర్తి ఓడలరేవు గ్రామంలో నాకు ఒక ఇల్లు, కాంప్లెక్స్ ఉంది, పన్ను వసూళ్ళ చేయడంలో డిమాండ్ నోటీసు నాకు అంద జేయలేదని, విష్ణుమూర్తి పన్ను కట్టలేదని సర్పంచ్ మల్లాడి మంగ య్యమ్మ ఆరోపించడం లో వాస్తవం లేదని ఆయన తెలియజేసారు. గ్రామంలో సర్పంచ్ విధుల్లో పంచాయతీ అధికారులతో గ్రామ అభివృద్ధి పై పన్ను పై సమీక్ష సమావేశం పెట్టి కొత్తగా ఇల్లు లు నిర్మించుకున్న వారికి ప్రతీ ఏడాది పన్నులు వేయవలసి ఉంది, అవి ఎంత వరకు రికవరీ అయ్యినవో లేదో చూడవలసిన బాధ్యత సర్పంచ్ పై ఉంది అని అన్నారు.నా దగ్గరికి ఎవ్వరు కూడా పన్ను కట్టాలని, రెండు అంతస్తులు కాంప్లెక్స్ పన్ను వేయడానికి ఆధార్ కార్డు గాని, డాక్యుమెంట్ కానీ అడగలేదని నేను కట్టవలసిన ఇంటి పన్ను బకాయి ఉంటే డిమాండ్ నోటీసు అందచేస్తే చెల్లిస్తానని విష్ణు మూర్తి తెలిపారు. ఈ నెల 23 న జరిగిన గ్రామ సభ లో తాను ఎవ్వరిని ఉద్దేశపూర్వకంగా వ్యక్తి గతం గా విమర్శించలేదని,వర్షాలు తో ఊరు మునిగిపోయిందని బ్లీచింగ్ చల్లించి దుర్వాసన రాకుండా చూడాలని, వీధి లైట్ లు, డ్రైన్ ఏర్పాటు, గ్రామం లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలు కు చేయవలసిన పనులు కోసం మాట్లాడానని, 50 లక్షలు రూపాయలు నా భార్య పదవీ నుండి దిగేటప్పటికి ఉండాలి అన్నాను కానీ మీకు అప్ప చెప్పి వెళ్ళాము అని అనలేదని, నేను మాట్లాడిన వెంటనే సర్పంచ్ భర్త ఉమా మహేశ్వరరావు స్పందించి విషయం తెలియజేసినప్పటికీ మళ్ళీ ఒక సర్పంచ్ గా ఇలా మాట్లాడటం ఎంత వరకు సబబు అని మీ విజ్ఞత కె వదిలేస్తున్నానని, నాకు విలువలు విశ్వసనీయత ఉన్నా యని నేను మీలా మాట్లాడానని విష్ణు మూర్తి అన్నారు. టీడీపీ నాయకులు పినపోతు రామకృష్ణ, నాతి లెనిన్ బాబు మాట్లాడుతూ ఓడలరేవు పంచాయతీ ఫరిధిలో గృహాలు నిర్మించుకున్న వారు అందరికి కొత్తగా పన్నులు వేసి పంచాయతీకి ఆదాయం వచ్చేలాగా చూడాలని, వచ్చిన అదయాన్ని గ్రామ అభివృద్ధి కి ఉపయోంఛి కృషి చేయాలని సర్పంచ్ ని కోరారు. సెక్రటరీ ని వివరణ కోరగా గృహం నిర్మిచుకున్న వారందరికీ కొత్తగా పన్నులు వేస్తామని, ఎవరైనా కొత్తగా గృహాలు నిర్మించుకున్న వారు ఉంటే ఆధార్ కార్డు, డాక్యుమెంట్ వివరాల తో గ్రామ పంచాయతీ కార్యాలయం లో అందజేయాలనీ కోరారు.ఈ కార్యక్రమం లో పినపోతురామకృష్ణ, కొప్పాడి రామకృష్ణ, వెంకట రామరావు, రేకాడి శేషగిరి, సి హెచ్ త్రినాధ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

### వైద్య విద్యార్థినిపై హత్యాచారంపై నిరసన... ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం



**ఏలూరు అర్బన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల, దుగ్గిరాల సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల, సెయింట్ జాన్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరులో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులతో గవరవరంలోని సెయింట్ థెరిస్సా మహిళ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ అమీనాపేట, పోలీస్ కళ్యాణ మండపం, ప్రభుత్వాసుపత్రి మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద భారీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా థెరిస్సా కాలేజీ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ డాక్టర్ మెర్సీ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ కొత్త చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ సమాజంలో ప్రతిరోజు ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని విమర్శించారు. ఏలూరులోని గత ఆరు మాసాల్లో ఆరుగురిపై హత్య, అత్యాచార ఘటనలు వెలుగు చూశాయన్నారు. సమాజంలో మహిళలను రెండో తరగతి పౌరులుగా చూసే సంస్కృతి పోవాలన్నారు. సినిమాలు, సాహిత్యం, ఇంటర్నెట్ మాధ్యమాల్లో హింస, అశ్లీలత అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అన్నిచోట్ల ఏర్పాటుచేసి నిందితులకు వెంటనే కఠిన శిక్షలు పడేలా చూడాలని నిర్భయ ఉదాంతం సందర్భంగా జస్టిస్ వర్మ కమిషన్ ఇచ్చిన సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు కోరుతున్న విధంగా వారు విశ్రాంతి తీసుకోవడానికి సెక్యూరిటీతో కూడిన గదులను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం నేర్పించాలని, దానికి అనువైన పాఠ్యాంశాలు పిల్లలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో థెరిస్సా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ సుశీల, ఎన్ఎస్ఎస్ సెల్, ఉమెన్స్ సెల్ ఆధ్యాపక బృందం, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ మోజెస్, ప్రిన్సిపల్ డాక్టర్ స్లివరాజు, విద్యార్థులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, నాయకులు జయ, హరీష్, దుర్గ, డివైఎఫ్ఐ నాయకులు పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.ఉంగుటూరు : మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, దాడులకు నిరసనగా చేబ్రోలు సర్పంచి లక్ష్మీ సునీత ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు గాంధీ విగ్రహం నుంచి నారాయణపురం వంతెన వరకు సుమారు రెండు కిలోమీటర్ల ర్యాలీ నిర్వహించారు. మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, కూటమి మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొలకత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి నిరసనగా మానవహారం నిర్వహించారు.



### జాయింట్ కలెక్టర్ చిన రాముడుని అభినందించిన

# స్వర్ణాంధ్ర రాంబాబు

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఎస్ చిన్న రాముడు ని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్లో ని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో చిన్న రాముడిని కలిసి దుస్తాలతో సత్కరించి అభినందించారు. సేవా కార్యక్రమాలు గురించి చిన్న రాముడు ఎంతో ఆసక్తిగా విన్నారని , అలాగే స్వర్ణాంధ్ర ఆశ్రమాన్ని ఒకసారి దర్శించవలసిందిగా రాంబాబు కోరగా తప్పనిసరిగా వస్తానని చిన్న రాముడు తెలిపారు అన్నారు రాంబాబుతో పాటు ప్రముఖ వ్యాపారవేత్త, బీసీ నాయకులు కొండేటి. భీమారావు, మార్గని. చంటిబాబు, సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

### రఘుదేవపురం వన్‌లో ఫ్యామిలీ

# ఫిజీషియన్ ప్రోగ్రాం



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం పిహెచ్సిలో వైద్యాధికారి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం జరిగింది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డెంగ్యూ మలేరియా జ్వరాలు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నీరు నిలవ లేకుండా చూడాలని ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని ఆయన కోరారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి ఎన్ రాజు, ఎం ఎల్ హెచ్ పి లిజి, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశాలు దేవి, కుమారి, షర్మిల పాల్గొన్నారు.

### జైళ్లలో ఖైదీల కంటే అధ్వాన్నంగా

# సంక్షేమ వసతి గృహాలు



**కర్నూలు, విశ్వంవాయిస్ న్యూస్ :** కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కర్నూలు నగరంలో ధర్నా చౌక్ నందు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి. సోమన్న అధ్యక్షతన రిలే దీక్ష చేపట్టడం జరిగింది. ఈ దీక్షను ఉద్దేశించి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునేప్ప , ఏఐఎస్ఎఫ్ జిల్లాఅధ్యక్ష్య, కార్యదర్శి, సోమన్న,యస్.షాబీర్ భాషలు మాట్లాడుతూ ఎస్సి, ఎస్టీ, బిసి మైనారిటీ హాస్టల్స్ లో విద్యార్థులకు పెండింగ్ లో ఉన్నటువంటి మెస్, కాస్మోటిక్, ట్రంకు పెట్టెలు, ఖాళీగా ఉన్న కుక్, కామాటి, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని, హాస్టల్ కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా మూసివేసినటువంటి హాస్టల్స్ పున ప్రారంభించాలని 27, 28,29,వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన దీక్షలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాలో కూడా 27వతేది నిరసన దీక్షను చేపట్టామన్నారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం హాస్టల్లో చదువుతున్నటువంటి విద్యార్థులకు రోజుకి 33 రూపాయలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈరోజు అన్న క్యాంటీన్ లో ఒక వ్యక్తికి రోజుకి 90 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెడుతున్నారని తెలిపారు. జైల్లో ఉన్నటువంటి ఖైదీకి ఒక రోజుకు 75 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. దేశానికి దశాదిశా చూపే విద్యార్థులపై రాష్ట్రప్రభుత్వం సవతి ప్రేమ చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. అదేవిధంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అనంతరం సిపిఐ నగర కార్యదర్శి పి. రామకృష్ణ రెడ్డి, నిరాహారదీక్షలకు మద్దతుగా ఏఐవైఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య, డిహెచ్ పిఎస్, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా వచ్చి హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు మీరు చేసే ప్రతి ఆందోళన కార్యక్రమంలో ప్రత్యక్షంగా ఆందోళన కార్యక్రమం లో పాల్గొంటామని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు లలితమ్మ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, శ్రీరాములు గాడ్, బిసన్న, శ్రావణి, భారతి పాల్గోని మాట్లాడినారు. అనంతరం ఈ దీక్ష కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్, విజేంద్ర, రంగస్వామి, శరత్, వీరేష్, దస్తగిరి, శ్రీకాంత్, నగర కోశాధికారి, అశోక్, నగర నాయకులు మధు, సాబీర్, వినయ్, కర్ణాకర్, హర్ష, చరణ్, మనోజ్, మహిళా నాయకులు, ప్రియా, సాదియా, విద్యార్థి, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

సినీ వాయిస్ CINEMA

# క్యూట్ హీరోయిన్ బికినీ కిక్కు



ప్రణిత సుభాష్ కెరీర్‌లో పెద్ద సినిమాలతో హిట్స్ అందుకోకపోయినా, ఆమె తన ప్రత్యేకమైన స్టైల్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తన అందంతో పాటు, అమాయకత్వమైన చూపులతో ఆమె తన పాత్రలకు అనువుగా ఉండేలా నటించింది. మీడియం రేంజ్ హీరోలకు జోడిగా మాత్రమే కాకుండా పెద్ద హీరోల సరసన సెకండ్ హీరోయిన్ గా కూడా ప్రణిత సుభాష్ నటించింది. తన పెళ్లి తరువాత సినిమాలకు కొంత దూరంగా ఉన్నా, సోషల్ మీడియాలో మాత్రం ప్రణిత సుభాష్ చాలా యాక్టివ్ గా ఉంది. ప్రతిరోజూ కొత్త ఫోటోలు పోస్ట్ చేస్తూ, తన ఫాలోవర్స్ సంఖ్యను పెంచుకుంటోంది. తల్లి అయిన తర్వాత కూడా ఆమె గ్లామర్ డోస్ ఏమాత్రం తగ్గలేదు. యూత్ ఫుల్ లుక్స్ తో ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటోంది. ఒక విధంగా ఆమె వయసు మరింత తగ్గుతుందని కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు చూస్తే కుర్రాళ్ళు షాక్ అవ్వాల్సిందే. అమ్మడు స్విమ్మింగ్ పూల్ లో అలా సరదాగా బికినీలో దర్శనమిచ్చింది. బ్లాక్ బికినీ లో గాగుల్స్ పెట్టుకొని అమ్మడు గతంలో ఎప్పుడు లేనంత వయ్యారంగా పోజ్ ఇచ్చింది. ప్రణిత తన ఎద అందాలను హైలైట్ చేస్తూ మరింత గ్లామర్ గా కనిపించింది. ఈ ఫోటోల్లో ఆమె ఇచ్చిన పోజ్ కూడా కుర్రాళ్ళ మతి పోగొట్టేలా ఉంది. స్టైలిష్ గా మరియు గ్లామర్ గా ప్రణిత ఈ ఫోటోలలో కనిపించింది. తక్కువ మేకప్ తో అయినా కూడా, ప్రణిత తన క్లివేజ్ అందాలను హైలైట్ చేస్తూ, నెటిజన్లను ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ, తన ఫాలోవర్స్ ను మరింత ఆకర్షిస్తుంది. పలు డిఫరెంట్ సినిమాలలో నటించి, తన టాలెంట్ ను ప్రదర్శించింది. ప్రస్తుతం ప్రణిత కన్నడ మరియు మలయాళంలో కొన్ని సినిమాలు చేస్తోంది. 2010లో 'బావ' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయమయిన ప్రణిత, ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పలు సినిమాలు చేసింది. తన పెళ్లి తరువాత, ప్రణిత తన పాత్రలను చాలా జాగ్రత్తగా ఎంపిక చేస్తోంది. ఈ మధ్య కాలంలో, ప్రణిత తన గ్లామర్ తో సోషల్ మీడియాలో హీటెక్కిస్తూ, ఫ్యాన్స్ ను ఎప్పటికప్పుడు సర్ ప్రైజ్ చేస్తోంది.

# జాన్వీ అందాల మెరుపులు



అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్ లో అడుగు పెట్టి చాలా కాలం అయ్యింది. కమర్షియల్ హీరోయిన్‌గా నటించడంతో పాటు, లేడీ ఓరియంటెడ్ సినిమాలను కూడా ఈ అమ్మడు చేసింది. జాన్వీ కపూర్ ప్రస్తుతం టాలీవుడ్ లో ఎన్టీఆర్ కు జోడీగా దేవర సినిమా ను చేస్తుంది. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా రెండు పార్ట్‌ల్లో రాబోతుంది. ఆ రెండు పార్ట్‌ల్లో కూడా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తూ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. మరో వైపు రామ్ చరణ్ కి కూడా జోడీగా ఈ అమ్మడు నటించేందుకు రెడీ అవుతుంది. ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు దర్శకత్వం లో ఈ సినిమా రూపొందుతుంది. మొదటి సినిమా ఉప్పెనతో కృతి శెట్టికి స్టార్ ఇమేజ్ ను తెచ్చి పెట్టిన బుచ్చి బాబు కచ్చితంగా జాన్వీ కపూర్ ను ప్రేక్షకులు కోరుకునే విధంగా అందంగా చూపించడం ఖాయం. సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ సందడి కొనసాగుతూనే ఉంది. అందాల ఆరబోత ఫోటోలతో నెటిజన్స్ ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ మరోసారి క్లీవేజ్ షో అందాలతో మతి పోగొడుతోంది. నడుము అందాలను చూపిస్తూ, కసిగా చూస్తున్న జాన్వీ కపూర్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అతిలోక సుందరి శ్రీదేవి కి అసలైన వారసురాలు జాన్వీ కపూర్ అంటూ ఫ్యాన్స్ ఈ ఫోటోలను చూస్తూ తెగ మురిసిపోతున్నారు.

# ఖర్చులో అస్సలు తగ్గని వరుణ్ తేజ్ మట్కా



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మాట్కా' సినిమాతో ఈసారి ఎలాగైనా సాలీడ్ హిట్ అందుకోవాలని అనుకుంటున్నాడు. 'మాట్కా' సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న భారీ చిత్రాల్లో ఒకటి. వినూత్న కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమా విజువల్ ఎక్స్‌పీరియెన్స్‌ను ప్రేక్షకులకు అందించేందుకు భారీగా ఖర్చు చేస్తున్నారు. పాత కాలం వైజాగ్‌ను ప్రతిబింబించేలా రూపొందించిన సెట్లు, సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. సినిమా మేకింగ్ వీడియోలు, ప్రీ-ప్రొడక్షన్ మరియు గ్రాండ్-స్కేల్ షూటింగ్‌ను చూపిస్తూ, అందులో వరుణ్ తేజ్ గ్లింప్సెస్ కూడా ఉన్నాయి. ఇండస్ట్రీలో అయితే మట్కా సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ప్రస్తుతం మూడవ షెడ్యూల్ లో ఉంది, ఇది 35 రోజుల లాంగ్ షెడ్యూల్. ఈ షెడ్యూల్‌కి ఏకంగా 15 కోట్ల బడ్జెట్ కేటాయించబడింది. ఈ భారీ బడ్జెట్‌తో రామోజీ ఫిల్మ్ సిటీలో పాత కాలం వైజాగ్ సెట్లు నిర్మిస్తున్నారు, వీటిని 70ల మరియు 80ల దశకాల కాలానికి అనుగుణంగా రూపొందించారు. వరుణ్ తేజ్ తన విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఉంటాడు. ఇక ఈ సినిమాలో ఆయన పాత్ర ఎంతో కీలకంగా ఉండబోతోంది. కథానాయకుడిగా గతంలో ఎప్పుడు లేనంత కొత్తగా మెప్పిస్తారని తెలుస్తోంది.

క్రీడా వాయిస్

## ఐసిసి అధ్యక్షుడిగా జై షా

# ఏకగ్రీవంగా ఎన్నిక

## డిసెంబర్ 1న బాధ్యతల స్వీకరణ



**దుబాయి:** అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) నూతన అధ్యక్షునిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనయుడు జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న గ్రెగ్ బార్క్‌లే(న్యూజిలాండ్) మరో దఫా ఆ పదవిలో కొనసాగేందుకు అవకాశం ఉన్నా.. ఆయన విముఖత చూపారు. దీంతో నూతన అధ్యక్ష పదవికి నామినేషన్లను ఆగస్టు 27వరకు దాఖలు చేసుకోవాల్సి ఉండగా.. ఇతర అభ్యర్థులెవరూ నామినేషన్లను దాఖలు చేయకపోవడంతో జై షా ఎన్నిక లాంఛనమైంది. ఇక ఐసిసికి బంగారు బాతుగా వ్యవహరిస్తున్న బిసిసిఐ.. ఇంగ్లండ్ అండ్ వేల్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ బోర్డుల నుంచి దరఖాస్తులు పడకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం. బార్క్ లే పదవీకాలం నవంబర్ 30తో ముగియనుండగా.. డిసెంబర్ 1న జై షా నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించనున్నాడు. ఈ పీఠంపై ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నాడు. దీంతో 35ఏళ్లకే ఐసిసి పీఠాన్ని అధిరోహించిన పిన్న వయస్కునిగా నిలిచాడు. భారత్ నుంచి ఐసిసి ఛైర్మన్‌గా ఎన్నికైన ఐదో వ్యక్తి జై షా. దీంతో ఈ పదవికి ఎన్నికలు జరగాల్సి ఉండగా.. మరో అభ్యర్థి ఎవ్వరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో జై షా ఎన్నిక లాంఛనమైంది. ఐసిసి చైర్మన్‌గా ఎన్నికపై జై షా స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని, క్రికెట్ ఫార్మాట్ల మధ్య సమన్వయం దెబ్బతినకుండా ఉండేందుకు, సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తానన్నారు. క్రికెట్‌ను విశ్వవ్యాప్తం తన ముందున్న లక్ష్యమన్నాడు. 2028లో లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టడం గొప్ప విప్లవాత్మకమైన నిర్ణయమన్నాడు. ఒలింపిక్స్‌లో క్రికెట్ ప్రవేశంతో మరింత పురోగతి చెందుతుందనే నమ్మకం ఉంది' అని షా వెల్లడించాడు. 2019 అక్టోబర్ నుంచి బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న షా.. 2021లో ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిఎ) చైర్మన్‌గా ఎన్నికయ్యాడు.

# దులీప్ ట్రోఫీకి జడేజా, సిరాజ్ దూరం



**ముంబయి:** దులీప్ ట్రోఫీకి స్టార్ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా దూరం అవుతున్నారు. ఇప్పటికే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు సెలెక్టర్లు విశ్రాంతినివ్వగా.. తాజాగా సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, పేసర్లు మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్‌లకు మినహాయింపునిచ్చింది. సిరాజ్, ఉమ్రాన్‌లు అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకోనున్నట్లు బిసిసిఐ సెలెక్టర్లు మంగళవారం ప్రకటించారు. రవీంద్ర జడేజా వ్యక్తిగత కారణాలతో విశ్రాంతి కోరుకున్నట్లు వెల్లడించగా.. సిరాజ్ స్థానంలో నవదీప్ సైనీ, ఉమ్రాన్ బదులు మధ్యప్రదేశ్ పేసర్ గౌరవ్ యాదవ్‌లను చోటు కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5నుంచి దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుంది.

# హర్మన్‌ప్రీత్‌కు పగ్గాలు..

## టి20 మహిళల ప్రపంచకప్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ



**ముంబయి:** 2024 ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌కు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) 15మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. బిసిసిఐ ప్రకటించిన 15మంది ఆటగాళ్ల బృందానికి కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన, వికెట్‌కీపర్‌గా యాస్తికా భాటియా ఎంపికయ్యారు. యువ స్పిన్నర్ శ్రేయంక పాటిల్ ఫిట్‌నెస్ సాధిస్తే తుజట్టు చోటు దక్కనుంది. ఉమా ఛెత్రి, తనుజా కన్వర్, సైమా ఠాకూర్ ట్రావెలింగ్ రిజర్వ్ ప్లేయర్స్‌గా ఎంపికయ్యారు. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ వేదికగా ఈ టోర్నీ జరగాల్సి ఉన్నా.. అక్కడి పరిస్థితుల రీత్యా యుఎఇకి మారింది. యుఎఇ వేదికగా అక్టోబర్ 10నుంచి మెగా టోర్నీ ప్రారంభం కానుంది. మెగా టోర్నీలో ఆడే 10జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో ఒక్కో జట్టు మిగిలిన జట్లతో ఒక్కోసారి తలపడనుంది. లీగ్ పోటీలు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్ల మధ్య సెమీఫైనల్ పోరు జరగనుంది. భారత మహిళలజట్టు అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో, 6న దుబారు వేదికగా పాకిస్తాన్‌తో మ్యాచ్‌లను ఆడనుంది. అక్టోబర్ 17, 18న సెమీఫైనల్స్, 20న ఫైనల్ జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే కేటాయించారు. భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, పుజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, హేమలత, ఆశా శోభన, రాధా యాదవ్, శ్రేయంకా పాటిల్‌లి, సంజనా సంజీవన్.

గ్రూప్-ఎ: భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంక

గ్రూప్-బి: దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్

భారత్ తలపడే మ్యాచ్‌ల షెడ్యూల్%ొ

%అక్టోబర్ 4: భారత్ ఐ న్యూజిలాండ్

అక్టోబర్ 6: భారత్ ఐ పాకిస్తాన్(దుబారు)

అక్టోబర్ 9: భారత్ ఐ శ్రీలంక

అక్టోబర్ 13 : భారత్ ఐ ఆస్ట్రేలియా

అక్టోబర్ 17: సెమీఫైన్-1

అక్టోబర్ 18: సెమీఫైనల్-2

అక్టోబర్ 20: ఫైనల్


విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్

బిజినెస్ వాయిస్

సినీ వాయిస్

క్రైం వాయిస్

హెల్త్ వాయిస్

కిసాన్ వాయిస్

విద్య వాయిస్

సక్సెస్ వాయిస్

వనిత వాయిస్

కిడ్స్ వాయిస్

తీర్పు వాయిస్


VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com